
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 24.07.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 08 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




# అరచేతిలో 'అమరావతి'

**అరచేతిలో వైకుంఠం చూపించడం గురించి విన్నాం, మాటల్లో కోటలు కట్టే వాళ్లను చూసాం. ఇప్పుడు మాస్టర్‌ప్లాన్‌లతో అద్భుత రాజధాని కట్టే వాళ్లను చూస్తున్నాం. సింగపూర్ రాజధాని అని పదేపదే కలవరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక అడుగు ముందుకే సాడు. నిద్రలేచింది మొదలు ఏ సింగపూర్ వాళ్ల జపమైతే చేస్తున్నాడో అదే సింగపూర్ దేశాల వాళ్లు ఇచ్చిన అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్ చూసి వూహాల్లో తేలిపోతున్నాడు. మాస్టర్‌ప్లాన్‌లో చూపించిన విధంగా రాజధాని కట్టేసినట్లే ఆనంద పడుతున్నాడు.**

రాష్ట్ర విభజన జరిగింది. ఈ విభజనలో చంద్రబాబుకూ వాటా వుంది. 2014ఎన్నికల్లో చంద్రబాబు చేసుకున్న పుణ్యమో, జగన్ చేసిన పాపమో ఏమో గానీ ఊహించని విధంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు సీఎం అయినా జగన్ సీఎం అయ్యున్నా అభివృద్ధి విషయంలో తేడా ఉండేదో లేదో చెప్పలేంగాని ఒక్క రాజధాని విషయంలో మాత్రం ఖచ్చితంగా తేడా ఉండేది. రాజధాని విషయంలో చంద్రబాబు అంత వెర్రి వ్యామోహంతో జగన్ ఉండేవాడు కాదు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం వల్ల పచ్చటి పైర్లు పండే గుంటూరుజిల్లాలో రాజధాని పెట్టాడు. దాదాపు 30వేల ఎకరాల మాగాణి పొలాలను ధ్వంసం చేయాలని సంకల్పించారు. అదే జగన్ సిఎం అయ్యుండుంటే శివ రామకృష్ణన్ కమిటీ సూచనల మేరకు ప్రకాశం జిల్లాలో రాజధాని వుండేది. గుంటూరు జిల్లాలో మాగాణి పొలాలు అలాగే వుండేవి. ప్రకాశం జిల్లాలో మెట్ట పొలాలకు గిరాకీ (మిగతా 11వ పేజీలో)



> మండిపడ్డ మంత్రులు

# 'నారాయణ' జపం మానండి

**రాజధాని కమిటీలో 'నారాయణ', సింగపూర్ పర్యటనలో 'నారాయణ', జపాన్ బృందంతో 'నారాయణ', అన్న క్యాంటీన్‌ల ఏర్పాటు పరిశీలన బాధ్యతలు నారాయణకు, చివరకు గోదావరి పుష్కరాల పనులు కూడా నారాయణకే!**

తెలుగుదేశం ప్రభుత్వంలో 'నారాయణ' జపం ఒక తారక మంత్రమైపోయింది. ముందొచ్చిన చెవులకన్నా వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లుగా మారింది తెలుగుదేశం ప్రభుత్వంలో నారాయణ పరిస్థితి. 35ఏళ్ల రాజకీయ అనుభవంగల (మిగతా 11వ పేజీలో)







# మారుతున్న జగన్

**2014** ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీదే అధికారం... జగనే సీఎం అనుకున్నప్పటికీ ఆ అంచనాలు తారుమారయ్యాయి. వైకాపా పరాజయానికి చాలా కారణాలున్నా, వాటిలో ఒకటి మతపరమైన ఆచార వ్యవహారాలు. ముఖ్యంగా వై.యస్.కుటుంబంపై క్రైస్తవ మత పక్షపాతులనే ముద్రపడింది. దీనికి కారణం కూడా లేకపోలేదు. వై.యస్.విజయమ్మ బైబిల్ చేతపట్టి బహిరంగంగా తిరగడం, ఆమె కూతురు, అల్లుడు షర్మిల, బ్రదర్ అనిల్‌కుమార్‌లు బహిరంగ మతప్రచారాలు చేస్తుండడం వారిపై మత ముద్రను వేసింది.

ప్రజా జీవితంలో ఉండేవాళ్లు తమదేకులమైనా, మతమేదైనా దానికి ప్రాధాన్యత ఇవ్వకూడదు. పుట్టిన మతం ఏదైనా అన్ని మతాలను (మిగతా 11వ పేజీలో)

# నిప్పులా మండుతున్న పప్పులు



- రేషన్‌షాపుల్లో పంపిణీ చేయని డీలర్లు
- రాత్రిళ్లు గుట్టుగా... బహిరంగ మార్కెట్టుకు తరలింపు

పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరలో ఉండాల్సిన కందిపప్పు, పెసల పప్పు, మినపప్పు తదితర పప్పుల ధరలు నిప్పులా మండిపోతున్నాయి. రేషన్‌షాపుల్లో పంపిణీ చేయాల్సిన కందిపప్పు రాత్రిళ్ళు గుట్టు చప్పుడు కాకుండా బహిరంగ మార్కెట్టుకు తరలిపోతున్నాయి. బయట మార్కెట్‌లో కందిపప్పు రూ.120లు వుంది. రేషన్‌కార్డు దారులకు కిలో కందిపప్పు రూ.50లకు పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో గత నెల నుంచి కందిపప్పు రేషన్‌షాపుల్లో పంపిణీ చేస్తున్నారు. బయట మార్కెట్లో కందిపప్పు ధరలు అధికంగా ఉండడంతో డీలర్లు కందిపప్పును బహిరంగ మార్కెట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కార్డుదారుడు అడిగితేనే కందిపప్పు ఇస్తున్నారు. ఎక్కువ శాతం మంది కందిపప్పు నాణ్యత లేదని తీసుకోవడం లేదు. ఈ విధంగా మిగిలిన కందిపప్పును నాణ్యమైన కందిపప్పులో కలిపి విక్రయిస్తు న్నారు. 10బస్తాల నాణ్యమైన కందిపప్పులో 3బస్తాల చౌక కందిపప్పును కలుపు తున్నట్లు సమాచారం.

# పరిశోధనలు మరింతగా వృద్ధి చెందాలి

**- విఎస్‌యు వర్క్‌షాప్‌లో ఉపకులపతి వీరయ్య**

వివిధ విభాగాల సమన్వయంతో అంతర్విభాగ పరిశోధన ఇంకా బాగా వృద్ధి చెందాలని విక్రమసింహపురి యూనివర్సిటీ ఉపకులపతి వి.వీరయ్య సూచించారు. విఎస్‌యు బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో డామియన్ సంస్థ సౌజన్యంతో నాలుగు రోజుల పాటు ఇక్కడ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో విఎస్‌యు ఉపకులపతి వీరయ్య మాట్లాడుతూ, మాలిక్యులార్ టెక్నిక్స్‌లో యువ పరిశోధకు లకు శిక్షణ అందించే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. పరిశోధన ఫలాలు మానవ జీవితశైలిని మార్చి మరింత తేజోవంతం చేయాలని ఆయన ఆకాంక్షిం చారు. నేడు నూతన అంతర్విభాగ పరిశోధనల ద్వారా వృద్ధి చెందిన నానో సాంకేతిక పరిజ్ఞానంతో మానవ శరీర అవయవాలకు ఆధునిక ఔషధ సరఫరా ద్వారా నిర్ధీత భాగాలకు సరఫరా చేయడం ఒక నూతన శకానికి నాంది పలికిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు పి. ఈశ్వర్‌రెడ్డి (తిరుపతి) మాట్లాడుతూ, బయోటెక్నాలజీ ద్వారా దేశంలో ఉన్న సారవంత మైన భూమిలో మరింత ఎక్కువ దిగుబడి పొందేలా చేసి, అధిక ఆహారోత్పత్తికి కృషి చేయవచ్చని సూచించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ శివశంకర్, ప్రిన్సిపల్ కె మురగయ్య, వర్క్‌షాప్ నిర్వహణా కార్యదర్శి డాక్టర్ ఉదయ్‌శంకర్, సహాయ కార్యదర్శి కిరణ్మయి, విఆర్ కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ సమాజానికి 25వేల విరాళం



నెల్లూరు మూలా పేటలో వున్న నూరేళ్ళ నాటి శ్రీ అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజం భవన పునర్ని ర్మాణానికి ముత్తుకూరు మండలం, మామిడిపూడి గ్రామానికి చెందిన వేళ్ళ పాళెం ప్రభాకర్‌రెడ్డి – రమణమ్మ దంపతులు రూ.25వేలు విరాళం అందజేశారు. సరస్వతీ సమాజం ట్రస్టీ పెమ్మారెడ్డి బాబురెడ్డికి ఈ విరాళాన్ని బుధవారం అందజేశారు. టెక్సాస్‌లోని హూస్టన్‌లో వున్న కుమారుడు వివేకానందరెడ్డి సహకారంతో ఈ విరాళం అందిస్తున్నామని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

# దాశరథికి నివాళి



నెల్లూరు న్యూమిలిటరి కాలనీలోని పెన్నా రచయితల సంఘం కార్యాలయంలో బుధవారం దాశరథి కృష్ణమా చార్యుల జయంతిని వైభ వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెరసం సభ్యులు దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెరసం కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి మాట్లాడుతూ దాశరథి అభ్యుదయ కవి అని ఆయనకు కళాప్రపూర్ణ బిరుదు వుందన్నారు. ఆయన రచించిన "తిమిరంలో సమరం" రచనకు 1974 సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అవ్వారు శ్రీధర్‌బాబు, గుండాల నరేంద్రబాబు, మోపూరు పెంచల నరసింహం, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, కారుమంచి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.




- పారిశుద్ధ్య కార్మికుల సమ్మెతో జిల్లా దుర్గంధం
- పొంచి వున్న అంటు వ్యాధుల ముప్పు

# మురికి కూపాలుగా మున్సిపాల్టీలు

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికుల సమ్మెతో నగరం, పట్టణాలు చెత్తమయమయ్యాయి. అడుగడుగునా పేరుకుపోయిన వ్యర్థాలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. రోడ్లపై పేరుకు పోయిన చెత్తాచెదారాలను శుభ్రపరచక పోవడంతో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నెల్లూరు నగర మున్సిపల్ కార్పొరేషన్, కావలి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేట మునిసిపాలిటీలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు గత 14రోజులుగా సమ్మెబాట పట్టడంతో చెత్త రోడ్లపైకి రావడంతో పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమ్మె ఇలాగే కొనసాగితే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. చెత్తా చెదారం రోజుల తరబడి ఉండటంతో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశముంది. నెల్లూరు నగరంలో రంగనాయకులపేట, సంతపేట, చిన్న బజారు, పెద్దబజారు, ట్రంకురోడ్డు, గాంధీ బొమ్మ, ఈద్గామిట్ట, జెండావీధి, నక్కల గుంట, స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, వేదాయపాలెం, ఆర్టీసీ బస్టాండు, ఏసి కూరగాయల మార్కెట్, ఫత్తేఖాన్‌పేట, భక్తవత్సలనగర్, ఎన్టీఓ కాలని, రామ లింగాపురం, హరనాథపురం, వెంగళ రావునగర్ తదితర ప్రాంతాల్లో పారి శుద్ధ్య పరిస్థితి దారుణంగా వుంది. అదే విధంగా జిల్లాలోని 6 మున్సిపాల్టీల్లో పరిస్థితి ఇంతే ఘోరంగా వుంది. మునిసిపల్ శాఖ అధికారులు వెంటనే ప్రత్యా మ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బుచ్చిలో 'పొలం పిలుస్తోంది'

బుధవారం బుచ్చిరెడ్డిపాళెం మండలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి, రైతులకు ఎరువుల వినియోగం పట్ల అవగాహన కల్పించారు. బుచ్చి మండలంలోని శ్రీపురంధరపురం, నాగాయగుంటలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి నీరజారెడ్డి పాల్గొని రైతులతో సంప్రదించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో కలసి వరి పొలాలను పరిశీలించారు. మోతాదుకు మించి ఎరువులను వాడవద్దని, ఎరువులను తగిన మోతాదులో వాడితే పంటకు కావాల్సిన అన్ని పోషక పదార్థాలు సమపాళ్ళలో లభించి, మంచి దిగుబడులు సాధించేందుకు వీలు కలుగుతుందని ఆమె సూచించారు. పంటలకు సేంద్రీయ ఎరువులను వాడడం వల్ల ఎంతో ప్రయోజనం వుంటుందని ఆమె రైతులకు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఏ.ఓ నీరజారెడ్డితోపాటు, ఏఇఓ అనూష, ఎంపిఇఓ అనిత తదితరులు పాల్గొన్నారు.

# కసుమూరులో రంజాన్ సందడి

వెంకటాచలం మండలంలోని కసుమూరులో వున్న పవిత్రపుణ్యక్షేత్రమైన మస్తాన్‌వలీ దర్గా రంజాన్ పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. కసుమూరు మస్తానయ్య దర్గా అంటే జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందినది కావడంతో, అందులోనూ రంజాన్ పర్వదినం రోజున ఆ దర్గాను సందర్శించుకుంటే మరింత పుణ్యప్రదమనే భావనతో భక్తులు శనివారం, ఆదివారం పెద్దసంఖ్యలో కసుమూరుకు విచ్చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్దసంఖ్యలో భక్తులు దర్గాకు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో దర్గాను దర్శించుకుని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, పవిత్రమైన రంజాన్ పర్వదినం సందర్భంగా నిర్వాహకులు దర్గాను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

# 1వతేదీ నుంచే సరుకుల పంపిణీ

చౌకదుకాణాల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెలా 1వతేదీ నుంచే సరుకులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ డీలర్లకు సూచిం చారు. వచ్చే నెల నుంచి బియ్యం, చక్కెర, కందిపప్పుతో పాటు గోధుమలు, గోధుమ పిండి కూడా అందిస్తామని, కనుక డీలర్లం దరూ గోధుమలు, గోధుమ పిండికి అవసర మైన డీడీలు తీయాలని బుధవారం ఆయ నొక ప్రకటనలో పేర్కొన్నారు. కార్డుదారు లకు కిలో కందిపప్పు 50 రూపాయలకే పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు.

# వికలాంగ విద్యార్థుల బాధలు తీర్చండి

**------ వికలాంగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుని విజ్ఞప్తి**

వికలాంగ విద్యార్థుల సమస్యలను తీర్చాలంటూ రాష్ట్ర వికలాంగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు గోవిందు సురేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నెల్లూరులోని సర్వోదయ కళాశాలలో నిర్వహించిన వికలాంగ విద్యార్థి సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగ విద్యార్థులు నిత్యం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను తాము ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి, పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. సమాఖ్యను మరింత విస్తరించే కృషిలో భాగంగా త్వరలో జిల్లాలోని అన్ని మండలాల్లో వికలాంగ విద్యార్థి సమాఖ్య కమిటీలను నియమిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు మందా సుకుమార్, సుజాత, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కళారంగానికి కన్నబిడ్డ... ఖాదర్

నెల్లూరు నాటకరంగం ఒక మహోన్నత నటుడిని కోల్పోయింది. ఆంధ్ర నాటకరంగంలోనే నెల్లూరుకు విశేష ఖ్యాతి తెచ్చిన ఎం.ఏ ఖాదర్ కన్నుమూత నెల్లూరు కళారంగానికి కంటనీరు పెట్టించింది. ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత –దర్శకుడు, తన నటనాచాతుర్యంతో సింహపురి సీమకు రంగస్థలరంగంలో విశేష ఖ్యాతి తెచ్చిన ఎంఏ ఖాదర్ ఈ నెల 17న ఆకస్మికంగా కన్నుమూశారు. వృత్తిరీత్యా ఆయన వైద్య ఆరోగ్యశాఖలో మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైరై నారు. రంగస్థల నటునిగానే కాక, పలు సినిమాల్లో కూడా ఆయన నటించి పేరొందారు. చిన్నతనం నుంచే నటనా రంగంపై ఆసక్తి వున్న ఖాదర్, నాటకరంగంలో ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులను సాధించారు. నంది అవార్డు గ్రహీతగా ఆయన నెల్లూరుకు మరింత ఖ్యాతి తెచ్చారు. పౌరాణిక, సాంఘిక నాటకరంగాల్లో విలక్షణమైన నటనాచాతుర్యంతో ఆయన రాణించారు. రచయితగా కూడా ఆయనకు మంచి పేరుంది. జీవన్‌శ్రీ అనే కలం పేరుతో ఆయన రచించిన పలు రచనలు అనేక పత్రికల్లో ముద్రితమయ్యాయి కూడా. నాటకరంగంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అందుకున్నా, ఆయన ఎంతో వినమ్రంగా, సౌమ్యంగా వుండే మంచి వ్యక్తిత్వంతో జీవిస్తూ అందరికీ శ్రేయోభిలాషిగా వుండేవారు. ఆయన మరణం నాటకరంగానికీ, కళాకారులందరికీ తీరని లోటు. ఆయన మృతితో జిల్లా ఒక ఉత్తమస్థాయి, సీనియర్ నటుడిని కోల్పోయి నట్లయింది. ఆయన మరణానికి స్థానిక కళాకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. అటు నాటక రంగంలోనూ, ఇటు సినిమా రంగంలోనే కాక, రచనా రంగంలోనూ తనదంటూ ప్రత్యేకమైన శైలితో రాణించి, తన జీవితంలో ఎన్నో ఉత్తమ స్థాయి అవార్డు లను, బహుమతులను సాధించి, సింహపురి సీమకే పేరుతెచ్చిన ఖాదర్‌గారి మరణానికి చింతిస్తూ, ఆయన కుటుంబానికి 'లాయర్' ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తోంది.

# టైలర్స్ కాలనీవాసుల కల నెరవేరింది



ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యేలకు గ్రాంట్ కేటాయించకపోయినా నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం దాతలు, మిత్రుల సహకారంతో తన నియోజకవర్గంలో కొన్ని మంచి కార్యక్రమాలు చేపడుతూనే వున్నారు.

నెల్లూరు 32వ డివిజన్‌లోని టైలర్స్ కాలనీలో ఎన్నో ఏళ్ల నుండి మంచినీటి సమస్య ఉంది. మున్సిపల్ నీళ్లు కూడా ఇక్కడ అంతంతమాత్రంగా వస్తుంటాయి. మైనార్టీలు ఎక్కువగా నివసించే ప్రాంతం. తాగేనీళ్లు శుభ్రంగా వుండవు. ఈ సమస్య తెలిసిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన స్నేహితుల సహకారంతో ఇక్కడ 7లక్షల రూపాయల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ఈ నెల 22వ తేదీన ప్రముఖ సంఘ సేవకురాలు సయ్యద్ ఆషాబేగం ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ రోడ్ల డివైడర్లు, పెద్దపెద్ద ఐలాండ్‌లు, అందమైన లైట్లు, అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డులు పెడితేనే అభివృద్ధి కాదని, పేద, మధ్య తరగతి కుటుంబాలుండే ప్రాంతాల్లో ప్రాథమిక వసతులు కల్పించడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేని కాబట్టి ప్రభుత్వం తన పట్ల వివక్ష చూపిస్తోందని, ప్రభుత్వం సహకరిస్తే ఇంకా చాలా అభివృద్ధి పనులు చేసి చూపిస్తానన్నారు.

సయ్యద్ ఆషాబేగం మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి లాంటి కష్టపడి పనిచేస్తూ, నిరంతరం ప్రజల మధ్య ఉండే ఎమ్మెల్యే దొరికినందుకు అభినందించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఖాదర్‌బాషా, కె.ప్రసాద్‌యాదవ్, పద్మనాభం, ముక్తియార్, హరిరెడ్డి, నవీన్‌రెడ్డి, విజయరామిరెడ్డి, డాక్టర్ సత్తార్, షేక్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆగష్టు 1న అన్నమయ్య జయంతి



నెల్లూరు రాజీవ్‌మార్గ్(మినీబైపాస్‌రోడ్డు) నందు అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నాటి నుండి ప్రతియేటా అన్నమయ్య జయంతి ఉత్సవాన్ని "అన్నమయ్య సర్కిల్"(విగ్రహం కూడలి) వద్ద నిర్వహిస్తున్న అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ ఈ యేడాది జయంతిని ఆగష్టు 1న జరపడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన విద్వాంసులను, సంగీత కళాకారులను రప్పించి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక కళాకారులచే కూడా ఈసారి వినూత్న తరహాలో అన్నమయ్య సంగీత నృత్య కార్యక్రమాలను నిర్వహించాలని సంకల్పిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

రత్నం విద్యాసంస్థల సారథి కె.వి.రత్నం గౌరవాధ్యక్షులుగా, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షుడిగా, మురళీకృష్ణ హోటల్స్ యం.డి వీరిశెట్టి హజరత్‌బాబు ఉపాధ్యక్షులుగా మరో 22మంది కార్యవర్గంతో మొత్తం 25మంది సభ్యులుగా మూడు సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ కమిటీ ఆధ్వర్యంలో ఈసారి తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్, మన నెల్లూరీయుడు చదలవాడ కృష్ణమూర్తిని కూడా ప్రత్యేక అతిథిగా ఆహ్వానించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమ పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి వుంది.



# చదువుకు చేయూతనిద్దాం

## -- ACT కార్యక్రమంలో కలెక్టర్ --

కేబుల్ టీవీ సంస్థ యాక్ట్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా యాక్ట్ శిక్షా పథకం బుధవారం నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.జానకి పాల్గొని 16 నగరపాలక ఉన్నత పాఠశాలలకు రూ.85 లక్షలతో 1200 బెంచీలను పంపిణీ చేసారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు వచ్చిన యాక్ట్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి యాక్ట్ సిఇఓ బాలమల్లాడి అధ్యక్షత వహించారు. యాక్ట్ చీఫ్ ప్లానింగ్ అధికారి శిఫాలీ మహాపాత్ర,ఎమ్మెల్సీ సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా ఎస్పీ గజరావు భూపాల్, నగర కమిషనర్ పి.వి.వి.యస్.మూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, యాక్ట్ నెల్లూరు హెడ్ ఆపరేషన్స్ సుబ్బారావు, ఎం.డి శివకుమార్‌రెడ్డి, డిఇఓ డి.ఆంజనేయులు,నగర కార్పొరేటర్లు,సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికారులకు మస్కా... ఆగని గుట్కా!




మద్యం, సిగరెట్, జూదం... ఈ వ్యసనాలన్నింటి కంటే ప్రమాదకరమైనది గుట్కా! పాన్‌మసాలా పేరుతో విక్రయించే గుట్కా ప్యాకెట్లు మనిషిని మృత్యువుకు దగ్గర చేయడానికి దగ్గరి దారులన్న మాట! మాణిక్‌చంద్, గుట్కా, పాన్‌పరాగ్... ఇలా రకరకాల పేరుతో ఈ పాన్‌మసాలాలను అమ్ముతుంటారు. పొగాకుతో పాటు అత్యంత విషపూరిత పదార్థాలను వీటిలో వాడుతుంటారు. మద్యం తాగేవాళ్ల చేత, జూదం ఆడేవాళ్ల చేతయినా మాన్పించవచ్చునేమోగాని పాన్‌మసాలాలు తినే వాళ్ల చేత మాన్పించడం మాత్రం చాలాకష్టం. వీటికి అలవాటు పడ్డారంటే మానుకోవడం గగనమే. అంతగా వీటికి బానిసైపోతారు. కొంతమంది మాకు మద్యం, సిగరెట్ అలవాటు లేదని, రోజుకు నాలుగు ప్యాకెట్లు గుట్కా మాత్రం వేసుకుంటామని చెబుతుంటారు. రోజుకు నాలుగు ప్యాకెట్లు సిగరెట్లు, నాలుగు క్వార్టర్‌లు మద్యం తాగేదానికన్నా గుట్కా నాలుగు ప్యాకెట్లు చాలా డేంజర్. ఈ గుట్కాలు నమిలే చాలామంది ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడ్డారు.

ఈ గుట్కాలపై సాక్షాత్తూ సుప్రీంకోర్టే నిషేధం విధించినా వీటి అమ్మకాలు, కొనుగోళ్లు మాత్రం ఆగడం లేదు. సుప్రీంకోర్టు నిషేధం విధించకముందు షాపుల్లో షాంపు సాచెట్స్ మాదిరిగా ఈ గుట్కా సాచెట్స్‌ను వేలాడదీసి అమ్ముతుండేవాళ్లు. నిషేధం విధించాక కొంతకాలం అమ్మడం మానేసారు. కొన్ని షాపుల వాళ్లయితే చాటుమాటుగా అమ్మేవాళ్లు. అయితే గుట్కాల నిషేధాన్ని ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకోకపోవడంతో వీటి అమ్మకాలు తిరిగి యధావిధిగా సాగుతున్నాయి. టీ బంకులు, బడ్డీకొట్ల వద్ద షరామామూలుగానే కనిపిస్తున్నాయి.

ఇటీవల వెంకటాచలం వద్ద కొందరు ఈ గుట్కాల తయారీ కేంద్రాన్ని పెట్టారు. అక్రమంగా గుట్కాలు తయారుచేసి మార్కెట్‌లోకి పంపించేవాళ్లు. పోలీసులకు సమాచారం రావడంతో వాళ్లు ఈ కేంద్రంపై దాడి చేసి పెద్ద స్థాయిలో గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. తయారీదారులపై కేసులు పెట్టారు. పాన్‌మసాలా అత్యంత ప్రమాదకరం. వీటిని తయారు చేయాలనే ఆలోచనే పెద్ద ప్రమాదం. ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసుకోవాలన్న ఆలోచనలను మానాలి. ఇలాంటి గుట్కా తయారీ కేంద్రాలు మళ్ళీ రాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలి.

# తీరప్రాంతాలకు తిరుమలేశుడు

- రామతీర్థంలో 25న శ్రీనివాస కల్యాణం

సముద్ర తీరప్రాంతాల్లోని మత్స్యకారుల్లో భక్తిభావాన్ని మరింతగా పెంపొందించేందుకు టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ తమ వంతు కృషి చేస్తోంది. ఆ మేరకు ఈ నెల 25న జిల్లాలోని విడవలూరు మండలంలో వున్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించాలని సంకల్పించింది. గురువారం నెల్లూరులోని టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, హిందూ ధార్మికమండలి అధ్యక్షులు సి.వి సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీన రామతీర్థంలో శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆ మేరకు స్వామివారి కల్యాణం పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ కల్యాణ మహోత్సవానికి సంబంధించి తీరప్రాంతాల్లో ధార్మిక ప్రచారం కోసం టిటిడి కల్యాణ ప్రచార రథం కూడా బుధవారమే నెల్లూరుకు విచ్చేసింది. తీరప్రాంతాల్లోని భక్తులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి, కల్యాణ మహోత్సవాన్ని తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి, జయరామయ్య, ప్రేమ్‌కుమార్, నాగేశ్వరరావు, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం

# తొలి కార్యక్రమం 26న

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆవిర్భావ దినోత్సవం పేరుతో తొలి కార్యక్రమాన్ని ఈ నెల 26వతేదీ ఆదివారం ఉదయం 10గంటలకు నెల్లూరు, టివిఎస్ కల్యాణ సదన్‌లో నిర్వహిస్తున్నట్లు రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రారంభకులుగా మాజీఎమ్మెల్యే, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు, ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, విశిష్ట అతిథిగా 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, ప్రధాన ఉపన్యాసకులుగా ప్రముఖ కవి కె.శివారెడ్డి, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ రచయిత్రులు డా॥ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి, వి.ప్రతిమలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహితీప్రియులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

# మలుపు తిరిగిన రాంనగర్ వివాదం

గత కొన్ని రోజులుగా అట్టుడుకుతున్న నెల్లూరు, రామ్‌నగర్‌లోని వక్ఫ్ బోర్డు వివాదస్థలం వ్యవహారం మలుపు తిరిగింది. ఇది వక్ఫ్ బోర్డు స్థలమని, దీనిని కాపాడాలంటూ వక్ఫ్ బోర్డు సిఇఓ జిల్లా కలెక్టర్‌కు లేఖ వ్రాసారు. ఈ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు కూడా కార్పొరేషన్ రద్దు చేసింది. దీంతో ఈ స్థలంపై వక్ఫ్ బోర్డు పైచేయి సాధించినట్లయ్యింది. సోమవారమే పలువురు ముస్లింలు ఈ స్థలంలోకి వెళ్లి అపార్ట్‌మెంట్ నిర్మాణానికి వేసిన పిల్లర్‌ను తొలగించారు. అక్కడ మసీదు నిర్మాణానికి సన్నాహాలు మొదలుపెట్టారు. సోమవారమే మేయర్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ముస్లింలు ఇక్కడ ప్రార్థనలు కూడా చేసారు.

ఈ స్థలం ముస్లింల శ్మశాన వాటికంటూ మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఇటీవల పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాడు. ఇక్కడ అపార్ట్‌మెంట్లు నిర్మాణం ఆపాలంటూ నగరపాలక సంస్థపై యుద్ధానికి దిగాడు. ఈ క్రమంలో సినీ నిర్మాత చిల్లర కళ్యాణ్‌కు వివేకాకు మధ్య తిట్ల యుద్ధం కూడా నడిచింది. ఈ సబ్జెక్ట్‌లోకి చిల్లర కళ్యాణ్ రావడానికి కారణం 2008లో ఈ స్థలం ఆయన కొనుగోలుచేసి వుండడమే. అంతకు ముందు ఈ స్థలం ముస్లిం శ్మశాన వాటికగా వుండేది. 2010 మాస్టర్‌ప్లాన్‌లో దీనిని ప్రైవేట్ స్థలంగా చూపించారు. ఇటీవల ఈ స్థలంలో అపార్ట్‌మెంట్ కట్టడం మొదలుపెట్టాక దీనిపై వివేకా ఆందోళన చేసారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గత పాలకుల వల్లే 2010 మాస్టర్‌ప్లాన్‌లో ఈ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులదిగా చూపించారని పరోక్షంగా వివేకా, భానుశ్రీలను విమర్శిస్తూ, ఇక్కడ మసీదు నిర్మాణానికి నేను సైతం ఒక రాయినందిస్తానంటూ మసీదు నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. రాంనగర్‌లో మసీదు నిర్మాణం మొదలైంది. ఈ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం మొదలుపెట్టిన వాళ్లు మాత్రం ఎవరిని పట్టుకోవాలో తెలియని స్థితిలో పడ్డారు.

## 'ప్రభా'తం

# ఆరోపణల సుడిలో కమలం

**అవినీతి మరకలేని బిజెపికి ఇప్పుడు పార్టీ నేతలపై వస్తున్న పలు ఆరోపణలు శిరోభారం కలిగిస్తున్నాయి. లలిత్‌మోదీ వ్యవహారం, వ్యాపం కుంభకోణాల పట్ల విమర్శలతో రాజ్యసభ అట్టుడికిపోతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సజావుగా జరిగిపోతాయనుకుంటున్న తరుణంలో, తొలి రోజు సభే రభసగా మారడం, అధికార-విపక్ష సభ్యుల వాగ్వివాదాలతో సభ అయిదుసార్లు వాయిదా పడి చివరికి వాయిదా పడిన నేపథ్యంలో, ఈ ఆరోపణల గండం నుంచి ఎలా గట్టెక్కాలనే ఆందోళనతో కమలనాధులు తీవ్ర తర్జనభర్జనలు పడుతున్నారు.**

తమ నిష్పాక్షిక విధానాలతో జాతీయంగానే కాక, అంతర్జాతీయంగా కూడా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంటున్న బిజెపికి, ప్రత్యేకించి ప్రధాని నరేంద్రమోడీకి ఇప్పుడు తమ పార్టీ నాయకులపై వచ్చి పడుతున్న పలు ఆరోపణలు శిరోభారం కలిగిస్తున్నాయి. పార్టీ నేతలపై వస్తున్న ఆరోపణలు కమలనాధులకు లేనిపోని కష్టాలకు గురిచేస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సజావుగా జరిగిపోతాయనుకుంటున్న తరుణంలో, తొలి రోజు సభే రభసగా మారడం, అధికార-విపక్ష సభ్యుల వాగ్వివాదాలతో సభ అయిదు సార్లు వాయిదా పడి చివరికి వాయిదా పడిన నేపథ్యంలో, ఈ సమస్యలనుంచి ఎలా గట్టెక్కాలనే ఆందోళనతో కమలనాధులు తీవ్ర తర్జనభర్జనలు పడుతున్నారు. అందులోనూ, ఏడాదికి పైగా బిజెపి పాలన అవినీతిరహితంగా వుండడంతో, తెచ్చుకున్న ఆ మంచిపేరును ఎలా నిలబెట్టుకోవాలన్నదే వారికి ప్రధమ ప్రాధాన్యంగా వుంది. అదే సందర్భంలో, ప్రధాని నరేంద్రమోదీ పారదర్శక పాలన ఈ దశలో విమర్శలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత కూడా కమలనాధులపై వుంది. ముఖ్యంగా, మంగళవారం రాజ్యసభను స్తంభింపజేసిన విషయాలు రెండే రెండు. ఒకటి లలిత్‌మోదీ వివాదం, రెండోది వ్యాపం కుంభకోణం. ఐపిఎల్ కుంభకోణంలో కీలక పాత్రధారి అయిన లలిత్‌మోదీపై ఇ.డి పలు కేసులు నమోదు చేసి వుంది. అతనిని భారత్‌కు తీసుకువచ్చి విచారణ జరిపించాలన్నది కాంగ్రెస్ డిమాండ్. అంతేకాదు, లలిత్‌మోదీ ఇంగ్లండ్‌కు పారిపోయి అక్కడ ఆశ్రయం పొందుతున్నారని, అతనికి బాసటగా వ్యవహరించిన రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరరాజేతో పాటు, ఈ విషయంలో ఆరోపణలు వచ్చిన కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ కూడా రాజీనామా చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వ్యాపం కుంభకోణంలో నిందితులపై చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంలో నిష్పాక్షిక దర్యాప్తుకు వీలుగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది. ఈ ఆరోపణలపై చర్చకు సిద్ధమని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం రాజీనామాలు చేసిన తర్వాతే చర్చకు అంగీకరిస్తామని పట్టుబట్టాయి. దీంతో, సమస్య మళ్ళీ మొదటికొచ్చింది. లలిత్‌మోదీ విషయంలో తనపై వచ్చిన ఆరోపణలపై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగానే వున్నట్లు విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ట్విటర్ ద్వారా తెలిపారు కూడా. అయినప్పటికీ, చర్చ అనేది దర్యాప్తునకు ప్రత్యామ్నాయం కాదని, వచ్చిన ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని, అది పూర్తయ్యేవరకు అభియోగాలను ఎదుర్కొంటున్నవారు పదవుల నుంచి వైదొలగాలనీ విపక్ష నేతలు పట్టుబడుతున్నారు. ఆరోపణలపై చర్చకు సిద్ధంగా వున్నప్పుడు, దర్యాప్తుకు ఎందుకు సిద్ధంగా లేరన్నది వారి ప్రశ్న. అసలు ఈ వ్యవహారాలపై చర్చ జరగడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, రచ్చ చేయడమే వారి ఉద్దేశ్యంగా కనపడుతోందని, కావాలనే కాంగ్రెస్ రాజ్యసభలో గందరగోళం సృష్టిస్తోందని, ఇలా పార్లమెంట్ సమావేశాలను అడ్డుకుంటే జాతికే నష్టమని బిజెపి నేతలు ప్రతివిమర్శలకు దిగారు. ఏదేమైనా రాజీనామా లేకపోతే చర్చే లేదని, ప్రధాని నరేంద్రమోదీ తను చెప్పే మాటలను ఆచరించాలని, ఆ ముగ్గురితో రాజీనామాలు చేయించాలని, ఆ తర్వాతే లలిత్‌మోదీ వివాదంపై చర్చ జరగాలని కాంగ్రెస్ అధికారప్రతినిధి ఆనంద్‌శర్మ పట్టుబట్టారు. ఈ వాగ్వివాదాల నేపథ్యంలో సభ వాయిదా పడింది. కానీ, వాస్తవానికి ఈ ప్రతిష్టంభన నుంచి ఎలా గట్టెక్కాలా అన్నది బిజెపి నేతలకు అంతుపట్టడం లేదు. లలిత్‌మోదీ వ్యవహారంలో ఆరోపణలు, ఇ.డి కేసులు వున్నప్పటికీ, ఈ వ్యవహారంపై అటు కేంద్రం కానీ, ఇటు బిజెపి నేతలు, లేదా ప్రధాని ఒక స్పష్టమైన విధానంతో నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించి వుంటే పరిస్థితి బహుశా ఇంతదాకా వచ్చేది కాదన్న అభిప్రాయాలు సర్వత్రా వున్నాయి. విపక్షాలు ఇంతగా గోలపెడుతున్నా అధికారపక్ష నేతలు ఇంతవరకూ మౌనరాగం ఆలపించడం ఎందుకన్నదే ఎవరికీ అంతుపట్టడం లేదు. ఆరోపణల నిగ్గు తేల్చకుండా, మీ పాలనలో కూడా గతంలో ఇలాంటి విషయాలు ఎన్నో జరగలేదా అంటూ, సమస్యను పక్కదారి మళ్ళించడం రాజకీయపరంగా చూస్తే రంజుగానే వుంటుంది కానీ, ప్రజల దృష్టిలో అది అసంబద్ధంగానే వుంటుందనే అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఎందుకంటే, గత పాలకులపై అలాంటి అవినీతి మరకలు, అవకతవకలు ఎన్నో వుండబట్టే కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ప్రజాదరణ కోల్పోయిందనే విషయం అందరికీ తెల్సిందే. ఇప్పుడు ఆ విషయాలను ప్రస్తావించినంత మాత్రాన ఆరోపణలు సమసిపోవునా?.. వచ్చిన విమర్శలు తొలగిపోవునా?.. సమస్యకు తగ్గ పరిష్కారం వెదకాలి గానీ, ఇతరత్రా ప్రత్యామ్నాయ ఆలోచనల వల్ల ప్రయోజనం వుంటుందా?.. గతపాలకులపై ఆరోపణలు వచ్చినప్పుడు విపక్షంలో వుండగా ఆరోపణలపై విచారణకు ఎంతగా పట్టుపట్టారో, ఇప్పుడూ అదే వైఖరి బిజెపి అనుసరించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. అయినా, చర్చకు సిద్ధంగా వున్నప్పుడు దర్యాప్తుకు ఎందుకు సిద్ధంగా లేరనే విమర్శలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సివుంది. అంతేకాదు, దేశవ్యాప్తంగా సంచలనం కలిగించే వ్యాపం వంటి కుంభకోణాల విషయంలో నేతలపై ఆరోపణలు వస్తే, విచారణకు ఆదేశించక అలాంటివి రాష్ట్రాలకే పరిమితమంటూ దాటవేయాలనుకోవడం, బిజెపి వంటి చిత్తశుద్ధి కలిగిన పార్టీకి సముచితమా?..అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా వుంది. అవినీతి ఏ రూపంలో వున్నా దానిని నివారించేందుకు అలుపులేని యుద్ధం చేస్తుందని ప్రజలంతా ఆశించిన పార్టీ, అవినీతిపరుల భరతం పడుతుందని ఆశించిన పార్టీ.. చివరికి తమవారిపైనే ఆరోపణలు వస్తే వాటి నిగ్గు తేల్చకుండా, తాత్సారం చేయడం ఏమిటన్నది ప్రజల్లో సర్వత్రా చర్చగా వుంది. ఇకనైనా ఇలాంటి అనుమానాలకు తావు లేకుండా పార్టీ గట్టి నిర్ణయాలు తీసుకోవాల్సి వుంది. ఈ సమస్యల నుంచి పార్టీని గట్టెక్కించాల్సిన బాధ్యత కమలనాధుల చేతుల్లోనే వుంది.

# ఆర్యక్షత్రియుల అభ్యున్నతికి కృషి చేస్తా



ఆర్యక్షత్రియుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని జిల్లా ఆర్యక్షత్రియ సంఘానికి నూతన అధ్యక్షునిగా ఎన్నికైన నందిగం చంద్రశేఖరవర్మ అన్నారు. నెల్లూరు రంగనాయకులపేటలోని ఎంసి చౌదరి కల్యాణమండపంలో జరిగిన సమావేశంలో ఆ మేరకు తమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖరవర్మ మాట్లాడుతూ ఈ సంఘానికి అధ్యక్షునిగా తనను ఎన్నుకోవడం తనకెంతో ఆనందంగా వుందని, ఆర్యక్షత్రియుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా పాటుపడతానన్నారు. కాగా, జిల్లా ఆర్యక్షత్రియ సంఘానికి ఉపాధ్యక్షులుగా ఉద్దండి చంద్రశేఖర్, పైకోట నారాయణ, కార్యదర్శిగా దామా వెంకటేశ్వర్లు, ఉప కార్యదర్శిగా టేకుమళ్ళ ఉమాశ్యామ్ ప్రసాద్, కార్యవర్గసభ్యులుగా కాళహస్తి నటరాజా, కనిగిరి సుబ్బారాయుడు, వై.సాయి, మానేశ్వర రావు, వెల్లా చెంచుప్రసాద్, నందిగం సాయి ప్రసాద్, చెన్నూరు దొరస్వామిరాజు, వై.వి.శివరామ్, పైకోట సుబ్రహ్మణ్యం, వెల్లాల సాయిరామ్ ఎన్నికైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# నిజాయితీపరుడు

ఏమారితే ఏదో ఒక విధంగా మోసం చేయాలనుకునే ఈరోజుల్లో ప్రయాణీకుడు మరచిపోయిన బ్యాగ్‌ను పోలీసులకు అప్పగించి ఓ ఆటోడ్రైవర్ తన నిజాయితీని నిరూపించుకున్నాడు. నెల్లూరు ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లోని ఆటోస్టాండులో బుజ్జయ్య ఆటోడ్రైవర్‌గా ఉంటున్నాడు. గుర్తు తెలియని ఓ వ్యక్తి రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద బుజ్జయ్య ఆటోలో ఎక్కాడు, రంగనాయకులపేట దర్గా వద్దకు ఆటోను మాట్లాడుకున్నాడు. గమ్యస్థలానికి చేరుకున్న తర్వాత బ్యాగ్ మరచిపోయి ఆటో దిగి వెళ్లిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న బుజ్జయ్య ఆ బ్యాగ్‌ను మూడవ నగర పోలీసులకు అప్పగించాడు.

# భిక్షాటనలో మున్సిపల్ కార్మికులు

గత పదకొండు రోజులుగా తమ సమస్యల సాధన కోసం ఆందోళన చేస్తున్న మునిసిపల్ కార్మికులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద భిక్షాటన చేశారు. ముందుగా భారీ ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## దగాపడుతున్న దళితులు

రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.నెం.186 మరియు 26లను విడుదల చేయడం ద్వారా ఇక మీదట కుల ధృవీకరణ పత్రం జీవితాంతం చెల్లుబాటు అవుతుందని ప్రకటించబడింది. కానీ దీనివల్ల కొన్ని సమస్యలు కూడా ఏర్పడేందుకు అవకాశం కలదు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన వారికి అనేక రాయితీలు ఇవ్వబడి ఉన్నాయి. ఉన్నత విద్యాలయాల్లో రిజర్వేషన్ ద్వారా ప్రవేశం, విద్యార్థి ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి సంస్థల్లో ఉద్యోగ అవకాశం, రాజకీయ పదవులు తదితర విషయాలు అందరికీ తెలిసినవే. అయితే చాలా మంది క్రైస్తవ దళిత తల్లిదండ్రులు, వారి సంతతి రిజర్వేషన్ల కొరకు విద్యాలయాల్లో ప్రవేశ సందర్భంలోనే దళిత హిందువులుగా నమోదు కాబడి, అటు పిమ్మట దళిత కుల ధృవీకరణ పత్రాలను పొంది షెడ్యూల్డు కులాలకు చెందిన అనేక రాయితీలను జీవితాంతం అనుభవిస్తున్నారు. అలాంటి వారు ఎప్పుడు క్రైస్తవ మతాన్ని స్వీకరించినది సంబంధిత చర్చీల వారికి, వారి బంధుమిత్రులకు మాత్రమే తెలుస్తుంది. తత్ఫలితంగా దళితులలో ముఖ్యంగా క్రైస్తవ మతాన్ని స్వీకరించినవారు నిర్భయంగా, స్వేచ్ఛగా షెడ్యూల్డు కులాల రాయితీలను పొందుతున్నారు. దీని వల్ల అసలుసిసలైన దళితులు నష్టపోతున్నారు.

**ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**

## చాలా చాలా మంచి ఆర్టికల్

తేది. 17.07.15 సంచికలో 'లాయర్' ప్రచురించిన 'మీడియా మంచి చేస్తుందా? ముంచేస్తుందా?' చాలా మంచి ఆర్టికల్. నేను ఎప్పటి నుంచో ఇదే మొత్తుకుంటున్నాను పచ్చటి పొలాలను నాశనం చేసి రాజధాని కట్టాల్సిన అవసరం వుందా అని. రేపు వేలాది ఎకరాల పంటభూములు కాంక్రీట్ అరణ్యాలుగా మారితే ప్రజలు ఏమైపోతారో అని. ఇంతకాలానికి ఈ విషయాన్ని 'లాయర్' ఎత్తి చూపినందుకు సంతోషంగా వుంది.

**ఫేస్‌బుక్ కామెంట్**

## ఇవి పబ్లిసిటీ చావులు

గోదావరి పుష్కరాల ప్రారంభం రోజున 27మంది చావుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచార పిచ్చే కారణం. ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఇంత పబ్లిసిటీ ఎందుకు, లఘుచిత్రాలేమిటి? అవతల తెలంగాణ సీఎం కేసీఆర్ ఇలాంటి ఆర్భాటాలు చేయలేదే! చంద్రబాబు ప్రచార పిచ్చి మరీ ముదిరింది.

**చీలుకూరు పాండు, చెన్నై.**

## మా మంచి కలెక్టర్




నెల్లూరు జిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి చాలా గౌరవపూర్వకంగా ఉంటున్నారు. చక్కని తెలుగు మాట్లాడుతూ ఎలాంటి ఆర్భాటం లేకుండా సహజంగా ఉంటున్నారు. పని చేసి చూపిస్తున్నారు. ఉదయగిరి వంటి మారుమూల ప్రాంతాల్లో కూడా పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. మరుగుదొడ్ల నిర్మాణంపై శ్రద్ధపెట్టారు. అవినీతి అధికారులకు సస్పెన్షన్స్‌తో దడ పుట్టిస్తున్నారు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## మద్యాంధ్రప్రదేశ్

ఇందుగలరని, అందులేరని సందేహము వలదు... ఎందెందు వెదికినా, అందందే కలరు చంద్రబాబు మందుబాబులు. నవ్యాంధ్ర, కొత్త మద్యంపాలసీ పుణ్యమా అని మందుబాబులతో నిండిపోనుంది. ధనమా? దైవమా? ఏది ముఖ్యం? అంటే ధనమే కదా అన్నిటికీ మూలం అంటూ ఆధ్యాత్మికనగరమైన తిరుపతిలోనూ మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. ఇకపై మందుబాబుల చిందులు మగువలకు ఇబ్బందులు! ఆ వెంకటేశ్వరస్వామే మగువలకు రక్ష!

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**



- నిండుకున్న జలాశయాలు
- అడుగంటిన భూగర్భజలాలు
- ఎండిన చెరువు
- గుక్కెడు నీటికి కరువు

# నీళ్లెట్లా... దేవుడా!

*గత పదేళ్లలో జిల్లాలో ఈ సంవత్సరం ఉన్నంత వర్షాభావ పరిస్థితులు ఎప్పుడూ లేవు. ముఖ్యంగా జూన్ నెలలో ఒక పదును వానైనా పడేది, ఈ ఏడాది అది కూడా లేదు. ఆకాశం మేఘావృతం కావడం తప్పించి చినుకు జాడ కనిపించడం లేదు. వానలు పడకపోగా గత నెలలో ఈదురు గాలులు, పిడుగుల ధాటికి రైతులు ఇంకా దెబ్బతిన్నారు.*

నెల్లూరుజిల్లాపై కరువు మేఘాలు దోబూచులాడుతున్నాయి. పేరుకు కోస్తా తీరంలో ఉన్నా కరువు విషయంలో రాయలసీమ జిల్లాలకు ఏ మాత్రం తగ్గడం లేదు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల సాగునీటికే కాదు, తాగునీటికి కూడా తీవ్ర కొరత ఏర్పడుతోంది. జూలై నెల చివరికి వచ్చినా ఎండలు ఇంకా మంట పుట్టిస్తూనే వున్నాయి. నైరుతి ఋతుపవనాలు వచ్చాయన్నారేగాని వాటి మూలంగా మనకు ఒరిగిందేమీ లేదు. కాస్తున్న ఎండల దెబ్బకు భూగర్భ జలాలు కూడా అడుగంటాయి. బోర్లు, బావులు, చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. మెట్ట మండలాలైన పడమటి ప్రాంతంలో అయితే పరిస్థితి ఇంకా దారుణంగా వుంది. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఉదయగిరి, వింజమూరు, మర్రిపాడు, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారాంపురం మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి కొత్త బోర్లు వేస్తున్నా నీళ్లు పడడం లేదు.

జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లు రెండూ డెడ్ స్టోరేజీలో ఉన్నాయి. గత ఐదేళ్లుగా శ్రీశైలం నుండి సోమశిలకు విడుదల చేస్తున్న కృష్ణ జలాలే జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటున్నాయి. కానీ ఈసారి కర్నాటకలో కూడా పెద్దగా వర్షాలు లేకపోవడంతో కృష్ణా నదికి వరద రాలేదు. శ్రీశైలంలో కూడా నీళ్లు లేవు. పెన్నకు వరదవచ్చి చాలాఏళ్లే అయ్యింది. దీంతో సోమశిలలో నీళ్లు లేకుండా పోయాయి. సోమశిల నీళ్లే జిల్లాలో తాగునీటి, సాగునీటి అవసరాలు తీర్చేవి.

ఇప్పుడు తాగునీటికి కూడా కష్టమైపోయింది. ఈ నెల, వచ్చే నెలలో వర్షాలు పడకుంటే మాత్రం మనకు కరువు బరువు తప్పదేమో!

- పేటలో మాటల యుద్ధం

# అటు వేనాటి ఇటు వాకాటి





*తెలుగుదేశం పార్టీలో పాత, కొత్త తరాల మధ్య అంతరాలు తొలిగిపోలేదు. అంతర్గత విభేదాలు సమసి పోలేదు. ఆధిపత్య పోరు నేపథ్యంలో ఇవి అంతకంతకు పెరుగుతూనే వున్నాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో అయితే పాత నాయకులు, కొత్త నాయకుల మధ్య కుమ్ములాటలు బహిరంగంగానే చోటుచేసుకుంటున్నాయి. సూళ్లూరుపేటలోని సత్యసాయి కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఈ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి.*

సోమవారం సమావేశానికి ఈ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆనం జయకుమార్‌రెడ్డి హాజరయ్యారు. సూళ్లూరుపేట నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, కె.గంగాప్రసాద్, వాకాటి నారాయణరెడ్డి, పరసా రత్నం వంటి నాయకులు వచ్చారు. వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతున్న సమయంలో మనోహర్ అనే కార్యకర్త లేచి... నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చావు, నువ్వు చెబితే వినే స్థితిలో లేమంటూ లేచాడు. దీంతో వాకాటి కోపంతో... కూర్చోవోయ్, మాకు తెలుసుగాని అని అన్నాడు. దాంతో అక్కడే వున్న మరో నాయకుడు వేనాటి పరంధామరెడ్డి కోపంతో వాకాటి మీదకు (మిగతా 11వ పేజీలో)

# ప్రసన్నుడయ్యాడా?



**వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలన్న ఆలోచనను నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తాత్కాలికంగా విరమించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడు జగన్ మాట్లాడి నచ్చుజెప్పడంతో ఆయన మెత్తబడ్డాడు. పార్టీ అధ్యక్ష బాధ్యతలను ఇంకొంత కాలం మోయడానికి సిద్ధపడ్డాడు.**

అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని ప్రసన్న భావించాడు. ఇది ఈ మధ్యే పార్టీలో కలకలం రేపింది. ప్రసన్న ఈ విధంగా ఆలోచించడానికి పలు కారణాలున్నాయి. జిల్లా పార్టీ కార్యాలయం బాధ్యతలు ప్రసన్న ఒక్కడే చూడాల్సి రావడం, పార్టీ కార్యాలయాన్ని నడపాలంటే నెలకు లక్ష దాకా ఖర్చవుతుండడం, అధ్యక్షుడిగా జిల్లా పార్టీ కార్యాలయానికి ప్రసన్న తప్ప మిగతా నాయకులెవరూ రాకపోతుండడం... ఈ కారణాలన్నీ ప్రసన్నలో అసంతృప్తిని, బాధను కలిగించాయి. అందరికీ లేని బాధ నా ఒక్కడికే ఎందుకన్నట్లు అధ్యక్ష పదవికి రాజీనామాకు సిద్ధపడ్డాడు. అదే క్రమంలో మాగుంట లే అవుట్‌లో వున్న పార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేయించాడు. పార్టీలో ఇది ప్రకంపనలు రేపింది. పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరుజిల్లా పార్టీలో పరిణామాల గురించి తెలుసుకుని ప్రసన్నను పిలిపించుకుని మాట్లాడారు. ఆయన బాధలు విన్నారు. లోటుపాట్లను సరిదిద్దుతానని, జిల్లాలోని అందరు నాయకులు జిల్లా పార్టీ కార్యాలయానికి వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. ప్రసన్నను మెత్త పరిచాడు. కొత్తగా జిల్లా పార్టీ కార్యాలయానికి ఒక భవనం కూడా చూడమని చెప్పాడు. జగన్ భరోసాతో ప్రసన్న రాజీనామా ఆలోచన వదులుకున్నాడు.



# ఉదయగిరికి సెట్ కావడం లేదు!

*జిల్లాలోనే ఉదయగిరి నియోజకవర్గంకు ప్రత్యేకత వుంది. ఇక్కడి ప్రజలు అభివృద్ధి, పథకాలు వంటివాటికంటే కూడా ఎమ్మెల్యే తమకు ఎంత దగ్గరగా వున్నాడనే దానికే ప్రాధాన్యతనిస్తారు. ఎమ్మెల్యే ఇక్కడ నాలుగు లైన్ల రహదారి వేయించాల్సిన పనిలేదు, రైల్వేలైన్‌ను వేయించాల్సిన పని, ఎయిర్‌పోర్టును, పారిశ్రామిక సెజ్‌లను కట్టించాల్సిన అవసరం లేదు. ఏడాదికి ఒకట్రెండు సార్లయినా అలా ఊర్లలోకి వచ్చి ఏం ఎలమందయ్యా, ఏం కొండయ్యా అంటూ భుజాల మీద చేతులు వేసి పలుకరిస్తుంటే చాలు. ప్రజలు పులకించిపోతారు. మళ్లీ ఎన్నికలకు కూడా ఆ ఎమ్మెల్యేకే ఓట్లను ఎత్తిపెడతారు.*

ఈ టెక్నిక్ బాగా వాడినవాడు, ఉపయోగించుకున్న వాడు వెంకయ్యనాయుడు. కాబట్టే ఎలాంటి హంగూ, ఆర్థిక బలం లేకున్నా, కేవలం నోటి మాటలతో, మంచి పలుకరింపులతోనే ఆయన 1978లో కాంగ్రెస్ గాలిని ఎదిరించి ఓసారి, 1983లో ఎన్టీఆర్ ప్రభంజనాన్ని అడ్డుకుని మరోసారి ఉదయగిరి నుండి ఎమ్మెల్యేగా గెలవగలిగాడు. ఎమ్మెల్యేగా వెంకయ్యను ఎంతో దగ్గరగా చూసిన ఉదయగిరి జనం, ఆయనతో ఆత్మీయంగా మసలుకున్న ఆ జనం ఈరోజుకు కూడా వచ్చే ఎమ్మెల్యేలంతా అలాగే వుండాలని కోరుకుంటున్నారు. అయితే ఉదయగిరిని వెంకయ్యనాయుడు వదిలి వెళ్లిన తర్వాత వచ్చిన ఎమ్మెల్యేలంతా జనంతో అంతగా మమేకం కాలేకపోతున్నారు.

వెంకయ్య తర్వాత 1985లో మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యారు. వెంకయ్య లాగా ఇక్కడి ప్రజలతో మమేకం కాలేకపోయారు. 1989లో మాదాల జానకిరాం వచ్చాడు. మేకపాటి రాజమోహన్‌రెడ్డిని మేలనిపించాడు. 1994, 1999లలో కంభం విజయరామిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాడు. ఎంతైనా ఒకప్పటి వెంకయ్యనాయుడు శిష్యుడు కాబట్టి ఆయన అడుగు జాడల్లో నడిచాడు. వెంకయ్య తర్వాత ఉదయగిరి జనానికి దగ్గరగా మసలుకుంది విజయరామిరెడ్డే. ఇక్కడి జనంలో కలిసిపోవడంలో కంభం ఫర్వాలేదనిపించుకున్నాడు. 2004, 2009లలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచాడు. కొందరికే పరిమితం కావడం, పరుషంగా మాట్లాడే స్వభావం వల్ల ఈయన అంతకుముందు ఎమ్మెల్యేలకు మంచి పేరు తెచ్చారు.

అయితే తాడినితన్నే వాడొకడుంటే వాడి తలను తన్నేవాడు ఇంకొకడుంటాడన్నట్లు ఇప్పుడు బొల్లినేని రామారావు ఎమ్మెల్యే అయ్యాడు. ఉదయగిరికి ఈయన అప్పుడప్పుడు చుట్టం చూపుగా వస్తుంటాడు. కాంట్రాక్టర్‌గా బిజీ మనిషి. వెంకయ్య, విజయరామిరెడ్డి లాగా ఊర్లలో తిరగాలంటే కుదరదు. అప్పుడప్పుడు నియోజకవర్గానికి వస్తాడు. కలిగిరి ఆఫీసులో కూర్చుంటాడు. అన్ని మండలాల నుండి ముఖ్యనాయకులను అక్కడికే పిలిపించుకుని మాట్లాడి పంపిస్తుంటాడు. ఎప్పుడన్నా మరీ తీరిక దొరికితే నియోజకవర్గంలోని ఇతర మండల కేంద్రాలకు వెళ్లి, అక్కడ నాయకులను కలిసి వస్తుంటాడు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తల్లో కూడా అప్పుడే ఎమ్మెల్యే పట్ల అసంతృప్తి మొదలయ్యింది. తిట్టినా, అరిచినా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డే మేలనే మాటలు అప్పుడే అక్కడ వినవస్తున్నాయి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
**అమ్మ ఫర్నిచర్ మాల్**
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



**శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవ ఆహ్వానము**

నెల్లూరు, ట్రంకురోడ్డు, గాంధీనగర్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవాలు

తేది.31-07-2015 శుక్రవారము నుండి తేది. 09-08-2015 ఆదివారము వరకు జరుగును.

తేది. 31.07.2015 శుక్రవారం నుండి 06.08.2015 గురువారము వరకు ప్రతి రోజూ ఉదయం 7-00గం.ల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకములు, అష్టోత్తర సహస్ర పూజలు జరుగును. పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద 75రూ/- చెల్లించి తగిన రసీదు పొంది పై పూజలలో పాల్గొని శ్రీ బాబా వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించ వలసిందిగా కోరుతున్నాము.

తేది. 31.07.2015 శుక్రవారం నుండి 06.08.2015 గురువారము వరకు ప్రతిరోజు శ్రీ బాబా వారి "ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి" 'నామసప్తాహం' 24గంటలూ భక్తబృందంచే జరుగును.

పై దినములలో ప్రతిరోజూ ఉదయం హోమ కార్యక్రమాలు జరుగును. సాయంత్రం లలితా సహస్రనామ సామూహిక పారాయణం జరుగును.

నగరోత్సవం: తేది.07-08-2015 శుక్రవారం సా॥6.00గం.లకు నగరోత్సవము జరుగును.

అన్నదానం : తేది.09-08-2015 ఆదివారము మధ్యాహ్నం శ్రీ బాబా వారికి అత్యంత ప్రీతికరమైన అన్నదాన కార్యక్రమం జరుగును.

ఇట్లు: కార్యవర్గము | శ్రీ షిర్డి సాయిబాబా మందిరం | గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

## ఆర్టీసీకి ఆదాయం

గత రెండేళ్ల కాలంలో విభజన ఉద్యమాలు, ఆందోళనలు, బంద్‌లు మూలంగా ఎంతో ఆదాయాన్ని, ఆస్తిని కోల్పోయిన ఆర్టీసీ గోదావరి పుష్కరాల పుణ్యమా అని నాలుగురూపాయలు సంపాదించుకుంది. జిల్లాలోని అన్ని డిపోల నుండి కూడా గోదావరి పుష్కరాలకు బస్సులను నడిపారు. పుష్కరాల 12రోజులు బస్సులు ప్రయాణీకుల రద్దీతో నడవడం విశేషం. పుష్కరాల స్పెషల్ పేరుతో ఛార్జీలు కూడా బాగానే పెంచారు. అద్దె బస్సుల ద్వారా కూడా ఆదాయం పెరిగింది. రాజమండ్రికి సూపర్‌లగ్జరీ, లగ్జరీ వంటి బస్సులనే కాక 'పల్లె వెలుగు' బస్సులను కూడా నడిపి ఈ సందర్భాన్ని సొమ్ము చేసుకున్నారు.

## ఇవేం ఎండలు బాబు!

గత నెలలో రెండురోజుల పాటు నాలుగు చినుకుల పడే సరికి అబ్బా... సమ్మర్ వెళ్లిపోయిందిలే అని అందరూ సంబరపడ్డారు. కానీ అసలు సమ్మర్ ఇప్పుడు కనిపిస్తోంది. జూలై నెలలో కూడా ఎండలు తగ్గలేదు. ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలు జనానికి సినిమా చూపిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రత 38డిగ్రీల దాకా ఉంటుంది. ఇళ్లల్లో ఏసిలు ఆన్‌చేస్తేకాని నిద్రపట్టని పరిస్థితి. కరెంట్ బిల్లులు వీపు విమానం మోత మోగిస్తున్నాయి.

## యూనివర్శిటి శుద్ధి

విక్రమ సింహపురి యూనివర్శిటికి పట్టిన గ్రహణం వీడిపోవాలని వైయస్సార్సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం గోదావరి పుష్కర జలాలతో పరిపాలనా భవనాన్ని శుద్ధి చేశారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ మాట్లాడుతూ రెండేళ్లుగా యూనివర్శిటీకి అవినీతి గ్రహణం పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి హాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణయాదవ్, చరణ్‌తేజ్, కమల్, సందీప్, వినీల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో ట్రాఫిక్ కష్టాలు

జిల్లా పోలీసు బలగాలను పెద్దఎత్తున గోదావరి పుష్కరాల బందోబస్తుకు తరలించారు. డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది... అన్ని స్టేషన్‌ల నుండి పంపించారు. ఒక్కో స్టేషన్‌లో ఇద్దరు ముగ్గుర్ని మాత్రమే ఉంచారు. దీంతో స్టేషన్‌లలో బాధితులకు సమాధానం చెప్పే దిక్కు లేకుండా పోయింది. ఇక నెల్లూరు నగరంలో చూస్తే రోడ్ల మీద పోలీసులు ఉన్నప్పుడే ట్రాఫిక్ నరకాన్ని తలపిస్తుంటుంది. అలాంటిది ఇక వాళ్లు రోడ్ల మీద కనిపించకుంటే వేరే చెప్పాలా? పుష్కరాల 12రోజులలో నెల్లూరు రోడ్లపై పోలీసులు పెద్దగా కనిపించలేదు. వాహనాల తనిఖీలు లేవు. అర్థరాత్రిళ్ల గస్తీలు లేవు. రోడ్లమీద ట్రాఫిక్‌ను నియంత్రించే వారు లేక ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

## గ్రౌండ్‌ఫ్లోర్‌కు ఫైర్ సర్టిఫికెట్ అక్కర్లేదు




ప్రైవేట్ పాఠశాలల భవనాలలో గ్రౌండ్‌ఫ్లోర్‌కు ఫైర్ సర్టిఫికెట్ ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం మినహాయించిందని నెల్లూరుజిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు మైథిలి మనోహర్‌రెడ్డి తెలిపారు. 17వ తేదీ నెల్లూరులోని సంఘం కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఫైర్ సర్టిఫికెట్ మినహాయింపుకు కృషి చేసిన నెల్లూరుజిల్లా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (నెపస్మా) రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డికి, సహకరించిన మంత్రులు పొంగూరు నారాయణ, గంటా శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆగస్టు 8, 9తేదీలలో ప్రీప్రైమరి ఉపాధ్యాయులకు మాంటిస్సోరి పద్ధతిలో శిక్షణ ఇస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు త్వరలో జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్, ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి జిల్లా కార్యదర్శి వెంకటరామయ్య, నగర అధ్యక్షుడు ఎం.శేషారెడ్డి పాల్గొన్నారు.

## అంతా అవినీతిమయం

### - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై వామపక్ష నాయకుల ధ్వజం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన అంతా అవినీతిమయంగా తయారైందంటూ తీవ్రంగా ధ్వజమెత్తుతూ నెల్లూరు నగరంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం పెద్దఎత్తున ర్యాలీ, ధర్నాందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు పి.దశరధరామయ్య, చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ, బిజెపి ఏడాది పాలన అంతా అవినీతిమయంగా మారిందని విమర్శించారు. లలిత్‌మోడీ వ్యవహారాన్ని వారు ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో బిజెపి పాలన మరింత దారుణంగా వుందని వారు ఆరోపించారు. అదేవిధంగా, రాష్ట్రంలో చంద్రబాబుపాలన ఘోరంగా వుందని విమర్శించారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు వారు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ ర్యాలీలో వామపక్ష నాయకులు రమేష్, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

## పోస్టల్ పుష్కర జలాలు అమోఘం




గోదావరి పుష్కరాల నేపథ్యంలో పోస్టల్ శాఖ అందించిన సేవలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. పుష్కరాలకు వెళ్లాలనే కోరిక అందరికీ వున్నా పోయిరావడానికి కావాల్సిన ఆర్థిక స్థోమత అందరికీ ఉండదు. అంతేగాక ఆరోగ్యం కూడా అందరికీ సహకరించదు. పుష్కరాలకు పోలేని వారి కోసం తపాలా శాఖ 'గాడ్ జల్' పథకాన్ని ప్రవేశపెట్టింది. గోదావరి జలాలను కోరిన భక్తుల ఇళ్లకు పంపే విధంగా తపాలాశాఖ వాళ్లు జూన్ మొదటి వారం నుండి జూలై మొదటి వారం వరకు ఆర్డర్‌లు తీసుకున్నారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 25వేల మంది 'గాడ్ జల్' క్రింద గోదావరి జలాలను బుక్ చేసుకున్నారు. ఇలా ఆర్డర్ చేసిన ప్రతి ఒక్కరికీ శుభ్రపరచిన అరలీటరు గోదావరి నీళ్ల బాటిల్‌ను పంపించారు. ఇంకా పంపుతున్నారు కూడా! ప్రతి ఒక్కరూ గోదావరి పుష్కరాలకు పోలేకపోయినా ప్రతి ఇంటికీ పుష్కర జలాలను పంపిన ఘనత తపాలాశాఖకే దక్కింది.


## లయన్స్ సేవలు స్ఫూర్తిదాయకం




ఒకప్పుడు వైద్య శిబిరాలకు, కంటి శస్త్రచికిత్సల నిర్వహణలో ముందుండే లయన్స్ క్లబ్ ప్రస్తుతం అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. ఆదివారం నెల్లూరు దర్గామిట్టలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు సేవాప్రియ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ తనకు అల్లూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవముందని, చాలాకాలం తర్వాత క్లబ్ సభ్యులను కలుసుకునే అవకాశం రావడంతో ఈ కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. మరో ముఖ్యఅతిథి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నెల్లూరు స్వర్ణోత్సవాలకు చేరువవుతున్న తరుణంలో బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కార్యవర్గం సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి క్లబ్‌ను అత్యున్నత స్థాయికి చేర్చాలన్నారు. *నూతన కార్యవర్గం:* లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా టి.నాగరాజు, కార్యదర్శిగా కె.ప్రవీణ్‌శంకర్, ట్రెజరర్‌గా ఆర్.హజరత్‌బాబు, సభ్యులుగా జి.అనూరాధ, టి.మాధవీలత, పి.శ్రీరాములు, ఎం.శ్రీధర్‌రావు, ఎం.వెంకటేశ్వర్లు, వై.శ్రీనివాసరావు, టి.రామకృష్ణారావులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఛైర్మెన్ గోలి అమరేంద్రరెడ్డి, మాజీగవర్నర్ వై.అమృతవల్లి, మాజీఅధ్యక్షుడు కృష్ణమోహన్, క్లబ్ సభ్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

### శ్రీ షిర్డీసాయి మందిరంలో

## 31 నుంచి గురుపూర్ణిమ మహోత్సవాలు



గురుపూర్ణిమ వచ్చిందంటే చాలు బాబా ఆలయాలు శ్రీ సాయి జయ సాయి, జయ జయ సాయి అంటూ భక్తులు పెద్దపెట్టున చేసే సాయినాధుని నామ స్మరణలతో హోరెత్తిపోతాయి. అందులోనూ, నెల్లూరు నగరంలో వుండే బాబా ఆలయాల్లో మరింత సందడి నెలకొంటుంది. ప్రత్యేకించి, ట్రంకురోడ్డులోని గాంధీనగర్ వద్ద వున్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం గురుపూర్ణిమ శోభతో అలరారుతుంది. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు గురుపూర్ణిమ ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించేందుకు ట్రంకురోడ్డులోని సాయిబాబా మందిరం నిర్వాహకులు భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి శ్రీషిర్డీసాయినాధునికి ప్రత్యేక పూజలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక సహస్రనామ పూజలు నిర్వహిస్తారు. పూజల అనంతరం స్వామివారికి షిరిడీ హారతులుంటాయని, తొలి ఏడు రోజులూ బాబావారికి అత్యంత ప్రీతిపాత్రమైన 'ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి' అంటూ నామస్మరణ చేస్తూ, 24 గంటలూ భక్తబృందంవారు శ్రీ షిర్డీసాయినాధుని నామసప్తాహాన్ని నిర్వహిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. 9వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 11 గంటల నుంచి అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల రోజుల్లో ప్రతిరోజూ సాయంత్రం 7 గంటల నుంచి సామూహిక లలితా సహస్రనామ పారాయణం, పూజలు, హనుమాన్ చాలీసా, ఖడ్గమాల పారాయణాలుంటాయని, ఈ కార్యక్రమాలను మహిళలచే నిర్వహిస్తామని, పాల్గొనదలచిన భక్తులు ముందుగా తమ పేర్లు మందిరం వారివద్ద నమోదు చేసుకోవాలని కోరారు. ఈ ఉత్సవాల్లో భాగంగా, 6వ తేదీ సాయంత్రం 7 గంటలకు బాబావారికి పుష్పయాగం నిర్వహిస్తామని, ఈ సందర్భంగా భక్తులు ఈ యాగానికి వివిధ రకాల పుష్పాలను ఇవ్వవచ్చని నిర్వాహకులు కోరారు. ఈ ఉత్సవాల సందర్భంగా 5-6 తేదీల్లో భక్తుల దర్శనార్థం షిరిడీ నుంచి శ్రీ బాబావారి పాదుకలను మందిరంలో వుంచుతామని వారు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్





రంజాన్ నెలలో ఉపవాసదీక్షలు పాటించి, నమాజులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అల్లా దయ కలుగుతుందని ఈద్గా ఇమామ్ ఖతీబ్‌సయ్యద్ అబూబకర్ అష్రఫి జిల్లా ప్రజలకు సందేశం ఇచ్చారు. 18వ తేదీ నెల్లూరు దర్గామిట్ట బారాషాహీద్ దర్గా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆశిస్తూ దువా చేశారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని ఆనందోత్సాహాలతో శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ మూర్తి పాల్గొనగా నగర డిఎస్పీ మగ్బూల్ ఆధ్వర్యంలో ఈద్గా ప్రాంగణంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## స్విమ్మింగ్ పూల్‌కు మోక్షం

నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో నీటి మార్పిడి కారణంగా మూసేసిన స్విమ్మింగ్ పూల్‌ను బుధవారం నుండి మరలా ప్రారంభించారు. ఎండాకాలంలో అధికసంఖ్యలో ఉపయోగించడంతో మరమ్మత్తులకు గురైంది. దీంతో 15 రోజులు పాటు మూసేసి మరమ్మత్తులు చేసిన అనంతరం అందుబాటులోకి తెచ్చారు.

# పెన్నకు పుష్కర జలశోభ



నెల్లూరు రంగనాథస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలోని పెన్నానదిలో 18వ తేదీ జిల్లా కలెక్టర్ ఎం.జానకి పవిత్ర గోదావరి జలాలను పెన్నానదిలో కలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి శోభతో అన్ని ప్రాంతాలు కళకళలాడాలన్న సంకల్పంతో గోదావరి పుష్కర జలాలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని నదులు, చెరువులు, కాలువల్లో కలపాలని ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈమేరకు రాజమండ్రి నుంచి ప్రత్యేకంగా నాలుగు బిందెలతో గోదావరి పవిత్ర జలాలు తీసుకొచ్చి పెన్నానదిలో కలిపి జిల్లాలోని అన్ని ఆలయాలకు, ప్రాంతాలకు పంపనున్నామన్నారు. తొలుత జిల్లా కలెక్టర్‌కు పూర్ణకుంభంతో వేదమంత్రాలతో ప్రధాన అర్చకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, సుదర్శనాచార్యులు, జిల్లాలోని వివిధ ఆలయాలకు చెందిన కార్యనిర్వహణాధికారులు పాల్గొన్నారు.

# శ్మశాన వాటిక ప్లాన్‌ను రద్దు చేయండి



నెల్లూరు రామ్‌నగర్‌లో కోట్ల రూపాయల విలువైన ముస్లిం శ్మశాన వాటిక స్థలం ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలని మాజీఎమ్మెల్యే ఆనం వివేకా నందరెడ్డి పేర్కొన్నారు. ఆది వారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రూ.6కోట్ల విలువైన ముస్లిం శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తే మూడు నెలలుగా ఉద్యమిస్తూ చివరకు ఆ స్థలం శ్మశాన వాటికదేనని తేల్చామన్నారు. ఆ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను ఆపేయాలంటూ హైకోర్టు నుంచి స్టే తెచ్చినట్లు తెలిపారు. తనపై ఆరోపణలు చేయించిన మేయర్ అజీజ్ ఈ స్థలం శ్మశాన స్థలం కాదని, మునిసి పాలిటీ స్థలం అసలే కాదంటూ ప్రకటనలు చేయించారని గుర్తు చేసారు. ఈ సందర్భంగా ఆ స్థలం రక్షణ అభివృద్ధి పేరుతో 14మందితో కమిటీని ఏర్పాటు చేసి ప్రకటించారు.

# తెలుగు ప్రజలకు అండగా నిలవండి

## జగన్‌ను కోరిన కేతిరెడ్డి



తమిళనాడులోని తెలుగు ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్క రించేందుకు వారికి అం డగానిలవాలని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని తమిళనాడు తెలుగు యువ శక్తి అధ్యక్షులు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి కోరారు. ఈ నెల 18వ తేదీన హైదరా బాద్‌లో ఆయన జగన్‌ను కలిశారు. భాషాపరంగా తమిళనాడులో తెలుగు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జగన్ దృష్టికి తెచ్చారు. చెన్నై నగరంతో పాటు కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, తిరువళ్ళూరు జిల్లాల్లో వై.యస్. అభిమానులు ఎక్కువుగా వున్నారని, వారంతా సమావేశమై తమ ప్రాంతాల్లో వై.యస్. విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారని ఆ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమానికి రావాలని ఆయన జగన్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి నిర్మాతగా నిర్మించిన 'పెద్దాయన' సినిమాలోని 'పెద్దాయన పెద్దాయన ఇది పాపపు లోకం పెద్దాయన' అనే పాటను జగన్ గుర్తు చేసుకుని కేతిరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు తెలుగు యువశక్తి కార్యవర్గ సభ్యులు యస్.యుగంధర్, కె.సుధాకర్‌రెడ్డి, యస్.కోటేశ్వరరావు, రామకృష్ణ, జి.యస్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## మా పెద్దల పుణ్యఫలమే

# నేను యం.యల్.ఏ అయ్యాను

**- కళాంజలి 'కళా కదంబం'లో అనిల్‌కుమార్‌యాదవ్**









నెల్లూరు నగరంలో కళారంగానికి జీవం పోస్తూ, వినూత్న కార్యక్రమాల రూపకల్పనలో ముందంజలో వుంటున్న "కళాంజలి" మరో కళా కార్యక్రమం "కళా కదంబం" జూలై 19వ తేదీ ఆదివారం టౌన్‌హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర శాసనసభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొని తన తాత చీమల రాధయ్య స్మృత్యంకంగా రూ.50వేల రూపాయలు అందజేసి 14మంది పేద కళాకారులను ఆర్థికంగా ఆదుకున్నారు.

ఈ సందర్భంగా భావోద్వేగంతో మాట్లాడిన అనిల్‌కుమార్‌యాదవ్ తన చిన్ననాడే తన తండ్రిని, తన ఇద్దరు తాతలని పోగొట్టుకుని పెద్ద దిక్కు లేకుండా పెరిగానని, వారు తనకు తోడుగా లేకున్నా పైనుండి వారిచ్చిన దీవెనెలు, జీవించి వున్నప్పుడు వాళ్లు చేసిన మంచి పనులే తనని యం.యల్.ఏగా చేశాయని అన్నారు. తన తాత చీమల రాధయ్యకు అత్యంత ఇష్టమైన కళా రంగానికి చెందిన పేదవాళ్ళను ఆదుకోవడం ద్వారా ఆయన రుణం తీర్చుకునే అవకాశం 'కళాంజలి' ద్వారా కలిగిందని అన్నారు.

ప్రతియేటా కళారంగానికి, పేద కళాకారులకు తనకు చేతనైన సాయం అందిస్తానని మరోసారి సభాముఖంగా వాగ్దానం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన పలువురు కళాకారులకు నగదు రూపంలో సహాయాన్ని అందించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన 'లాయర్' ప్రభు కావలి మాజీ శాసన సభ్యుడు బీద మస్తాన్‌రావు తన తండ్రి పేరున అందజేస్తున్న కళా పురస్కారాన్ని చూసి స్పందించిన అనిల్‌కుమార్‌యాదవ్ తన తాత పేర పేదకళాకారులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. అనిల్ స్ఫూర్తితో మరికొంతమంది ముందుకొస్తే పేద కళాకారులకు వూరట లభిస్తుందని అన్నారు. తాను చేపట్టిన ఏ కార్యక్రమాన్నైనా సమర్ధ వంతంగా నిర్వహించడంలో కష్టపడుతున్న 'అనంత్'ని ప్రభు అభినం దించాడు. కళాంజలి త్వరలో జరుపుకోనున్న రజతోత్సవానికి కళాప్రియు లంతా అండగా నిలిచి ఆశీస్సులు అందించాలని విజ్ఞప్తి చేశాడు.

ఈ సందర్భంగా ప్రముఖ సినీ నృత్య దర్శకురాలు ప్రేమలతకు "నాట్య కళామయి" బిరుదుతో కళాంజలి పురస్కారాన్ని ముఖ్యఅతిథులు అందజేశారు. సభా కార్యక్రమానికి ముందు ఏ.లక్ష్మీప్రసన్న శిష్యురాండ్రు ఆలపించిన అలనాటి మధురగీతాలు వీనులవిందుగా సాగాయి. ఆశ్రితారెడ్డి శాస్త్రీయనృత్యం, శ్రీ గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి శిష్యురాండ్రు చేసిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. తాడేపల్లిగూడెంకు చెందిన వెంకట్రావు చేసిన సినీహీరో కృష్ణ డూప్ డ్యాన్సులు, హైదరాబాద్‌కు చెందిన అర్చన సినీడ్యాన్సులు, చిన్ను, కావలి ఉమా మహేశ్వరరావు శిష్య బృందం ప్రదర్శనలు ఆకట్టు కున్నాయి. రిషితారెడ్డి యోగా విన్యాసాలు అబ్బుర పరిచాయి.

ఈ 'కళాకదంబం'లో మురళీకృష్ణ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా రవికుమార్, ఎం.కె.గోల్డ్ అధినేత భరత్ ఎం షా, విశాఖపట్నం పోర్టు సిఎం సెక్యూరిటీస్ టి.రాజేంద్ర ప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, చిన్ని నారా యణరావు, ప్రముఖ శాస్త్రవేత్త డా॥ ఎ.జగదీష్, ఎంపి ఆంజనేయులు తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

వ్యాఖ్యాతలుగా దువ్వూరు బెనర్జీ, వై.శైలజ వ్యవహ రించారు. శాస్త్రీయ నృత్యాలు, సినిమా పాటల విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. కళాంజలి వ్యవస్థాపకులు కళాంజలి అనంత్ పర్యవేక్షించారు.

# అవినీతి నిరోధక శాఖలో సిబ్బంది కొరత

నెల్లూరు అవినీతి నిరోధక శాఖలో సిబ్బంది కొరతతో ఇబ్బందులెదుర్కొంటున్నారు. అవినీతిపరుల పాలిట సింహస్వప్నంగా వుండే ఏసిబి ప్రస్తుతం నామమాత్రపు దాడులతో సరిపెట్టుకుంటోంది. ఏసిబి నెల్లూరు విభాగంలో ఒక డిఎస్పీ, నలుగురు ఇన్స్‌పెక్టర్లు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, 9మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి వున్నా, ప్రస్తుతం ఒక ఇన్స్‌పెక్టర్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, 8మంది కానిస్టేబుళ్లు మాత్రమే వున్నారు. ఏడు నెలల కిందట నెల్లూరు ఏసిబి డిఎస్పీ నంజుండప్ప రేణిగుంట డిఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవ్వరినీ నియమించక పోవడంతో ఒంగోలు డిఎస్పీ ఆర్‌విఎస్‌ఎన్ మూర్తి ఇన్‌ఛార్జ్‌గా వున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కూడా ఎవ్వరినీ నియమించలేదు. ఈ ఏడాది ఇప్పటివరకు ఏడు ట్రాప్ కేసులు, రెండు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈమధ్య ఇన్‌స్పెక్టర్ కృపానందం బదిలీ అయ్యారు. ప్రస్తుతం శివకుమార్‌రెడ్డి ఒక్కరే వున్నారు. గతంలో వరుస దాడులతో ముచ్చెమటలు పట్టించిన ఏసిబి అధికారులు సిబ్బంది కొరతతో సతమతమవుతున్నారు.

# చెన్నై కవిసమ్మేళనంలో నెల్లూరు కవులు

చెన్నైలో ఇటీవల నిర్వహించిన 24గంటల నిరవధిక జాతీయ కవి సమ్మేళనంలో నెల్లూరు కవులు పాల్గొని స్ఫూర్తి దాయకమైన కవితలు వినిపించారు. చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయంలో దక్షిణభారత తెలుగు సంక్షేమ సంఘం, మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 18వతేది ఉదయం 10గంటల నుండి 19వతేది 10గంటల వరకు కవిసమ్మేళన కార్యక్రమం జరిగింది. నెల్లూరు జిల్లా నుండి కవులు కె.మురళీమోహన్‌రాజు, పచ్చా పెంచలయ్య, జంజం కోదండరామయ్య, దగ్గుపాటి రాధాకృష్ణ, పి.నాగరాజా రావు, గాలి లలిత, ఇందిరారెడ్డి, ములుగు లక్ష్మి పాల్గొని సింహపురి కవితా వైభవాన్ని ఆవిష్కరించారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# విద్యార్థులకు రోటరీక్లబ్ స్కాలర్‌షిప్‌లు




విద్యార్థికి చెక్కును అందజేస్తున్న రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ మాధవరెడ్డి, ప్రక్కన రోటరీ అధ్యక్షుడు అశోక్ చక్రవర్తి

గూడూరులోని మఠంవీధిలోని రోటరీ భవనంలో ఇటీవల దొడ్ల రుక్మిణమ్మ రోటరీ స్కాలర్ షిప్స్ పేరిట దొడ్ల సుబ్బ రామిరెడ్డి, అల్లూరు ఆదిశేషారెడ్డిల భూరి విరాళంతో ఏర్పాటైన ఉపకారవేతనాలను విద్యార్థులకు అందజేశారు. వివిధ కళాశాలలో వైద్య, ఇంజనీరింగ్ తదితర వృత్తి విద్యలనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ డా॥ కె.మాధవరెడ్డి షుమారు ఒక లక్షా యాభై వేల రూపాయలు అందజేశారు. ఈ సాయాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎస్.వి.అశోక్‌చక్రవర్తి కోరారు. గూడూరు రోటరీ క్లబ్ చేస్తున్న వివిధ సేవాకార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ ట్రస్టీ పి.జానకిరామిరెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో రొటేరియన్ బీమా శివకుమార్‌రెడ్డి 'అలెగ్జాండర్ – ది గ్రేట్" అంశంపై ప్రసంగించారు. రొటేరియన్లు సురేంద్ర, దశరథరామి రెడ్డి, కె.మునిగిరీష్, కె.సుందరరామిరెడ్డి, దయాకరరెడ్డి, జిడి రెడ్డి, కె.ఎస్.రెడ్డి, ఎల్.వి. రమణబాబు, జానకిరామిరెడ్డి, కార్యదర్శి మునిరాజా తదితరులు పాల్గొన్నారు.




అవార్డులు అందుకుంటున్న గూడూరు లయన్స్‌క్లబ్ సభ్యులు

# లయన్స్ క్లబ్ సేవలకు గుర్తింపు

గూడూరు లయన్స్ క్లబ్ సేవలకు గుర్తింపుగా జిల్లా లయన్స్ క్లబ్ ఎనిమిది అవార్డులు సొంతం చేసుకున్నట్లు క్లబ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తోట సురేష్‌నాయుడు, నీలకంఠం నవీన్ జయకుమార్ తెలిపారు. క్రికెట్ మ్యాచ్ నిర్వహణ, రక్తదాన శిబిరం, కంటి వైద్య శిబిరం, తాగునీటి ట్యాంకు ఏర్పాటు తదితర సేవా కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డులు అందజేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా తోట సురేష్‌నాయుడు నాలుగు అవార్డులను, నవీన్ జయకుమార్, మెట్టా రాధాకృష్ణారెడ్డి, వై.చలపతిరావు, మల్లు విజయకుమార్‌రెడ్డి అందుకున్నారు. ఈ అవార్డులను నెల్లూరు స్వర్ణ వేదికలో నెల్లూరు లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నపరెడ్డి, మాజీగవర్నర్ అమృతవల్లి, బాలస్వామి తదితరుల ద్వారా ఆదివారం అందజేసినట్లు తెలిపారు.

# సేవాభారతి యూనిఫామ్‌లు



విద్యార్థులతో రాపూరు మాజీ ఎంపీపీ బండి కృష్ణారెడ్డి

గూడూరు మండలం, కొమ్మ నేటూరు పంచాయతీలోని రెడ్డి గుంట, తిరువెంగళాయపల్లి, కొమ్మనేటూరు అరుంధతీయ వాడ, నెర్నూరు పంచాయతీ పుట్టంరాజువారి కండ్రిగ, వెడిచర్ల కాలనీ... ఈ మూడు పంచాయితీలలో 11అంగన్‌వాడీ స్కూళ్లు, 5ఎలిమెంటరీ స్కూల్స్‌కు గాను 450మంది విద్యార్థులకు ఇటీవల సేవాభారతీ ట్రస్టు ఛైర్మెన్ బండి ఆదినారాయణ, వారి తండ్రి రాపూరు మాజీఎంపీపీ బండి కృష్ణారెడ్డి స్కూల్ యూనిఫామ్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొమ్మనేటూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనిమెళ్ళ రవికుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దుర్గంధం భరించలేకున్నాం

గూడూరు పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం, ఫైర్‌స్టేషన్ వెళ్లే దారిలో పట్టణ ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. పాతబస్టాండ్ పక్కనే ఉండడంతో ప్రయాణీకులు, మరికొంతమంది స్థానికులు బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. ఈ దుర్వాసనకు ఈ మార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో స్టేడియంలో పురుషులు, మహిళలు నడకకు వస్తుంటారు. కానీ దుర్గంధం కారణంగా ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఇకనైనా అధికారులు పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# స్టేడియంలో నీటిశుద్ధి యంత్రం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, పక్కన ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వైజేపీ లయన్స్‌క్లబ్ దాతృత్వంతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని 18వ తేదీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, డిఎస్పీ కె.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా కారులకు నీటి అవసరం ఎంతో ఉంటుందని, దాన్ని గుర్తుంచు కొని రూ.50వేలు విలువచేసే నీటిశుద్ధి యంత్రాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లా డుతూ స్టేడియానికి ఎంతో చరిత్ర ఉందని, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను గుర్తించి క్లబ్ ప్రతినిధి మంజులమ్మ నీటియంత్రం ఏర్పాటు చేయడం ఆదర్శనీయమన్నారు. క్లబ్ అధ్యక్షురాలు మంజులాదేవి మాట్లాడుతూ ఈ ఏడాదిలో 99కార్యక్రమాలు చేశా మని, 100వ కార్యక్రమం ఎక్కువ మందికి ఉపయోగపడేలా ఉండా లని ఈ యంత్రం ఏర్పాటు చేశా మని తెలిపారు. ఈ వాటర్ ప్లాంటుకు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి రూ.10,000లు, మున్సిపల్ ఛైర్ పర్సన్ దేవసేన రూ.10,000లు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కె.గురునాథం, మదనమేటి రమణయ్య, డాక్టర్ చంద్రహాస్, మురళీనాయుడు, చక్రపాణి, సుబ్బయ్య, చంద్రశేఖర్, రొటేరియన్లు కె.మునిగిరీష్, శ్యాంసుందరరావు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వైజేపీ లయన్స్ క్లబ్‌కు 9అవార్డులు




అమృతవల్లి చేతుల మీదుగా బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును అందుకుంటున్న వైజేపీ లయన్స్ ప్రెసిడెంట్ మంజులమ్మ

గూడూరు పట్టణంలోని వైజేపీ లయన్స్ క్లబ్‌కు 2014 –15కు గాను చేసిన సేవా కార్య క్రమాలకు గుర్తింపుగా తొమ్మిది అవార్డులను ఆదివారం నెల్లూరు స్వర్ణవేదిక ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అందుకున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షురాలు కోసూరు మంజులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అందరికి ఉపయోగపడే 100కార్యక్రమాలను నిర్వహించామని, దీంతో తాను జిల్లాలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అవార్డు, బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు ఫాస్టు డిస్ట్రిక్ట్ గవర్నర్ అమృతవల్లి, ప్రస్తుత గవర్నర్ చిన్నపరెడ్డి చేతుల మీదుగా అందుకున్నానన్నారు. వైస్‌ప్రెసిడెంట్ బాలస్వామి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. అలాగే క్లబ్‌లో వివిధ విభాగాల్లో అవార్డులు వచ్చాయని వివరించారు.

# 'నీరు-చెట్టు'లో భారీ అవినీతి

## - ఎం.పి వరప్రసాద్ విమర్శ



రాష్ట్రంలో జరుగుతున్న నీరు – చెట్టు ఓ బోగస్ పథకమని, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని వైఎస్ఆర్‌పార్టీ తిరుపతి ఎం.పి. వరప్రసాద్ అధికార తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలో నిర్వహించిన "నీరు – చెట్టు" పథకంపై వ్యతిరేకంగా మహాధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎం.పి. వరప్రసాద్ మాట్లాడుతూ నీరు – చెట్టు పథకంలో రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి ప్రజా సొమ్మును దోచు కుంటున్నారని, కొండ నాలుకకు మందేస్తే ... ఉన్న నాలుక ఊడిపోయిందనే చందంగా "నీరు – చెట్టు" పనులు తయారై నట్టు ఎద్దేవా చేశారు. గట్టిగా ఉన్న చెరువు కట్టలను వదిలేసి తప్పుడు లెక్కలు చూపుతున్నారన్నారు. చిత్తూరు జిల్లాలో 1611 చెరువుల అభివృద్ధి పనులకు 8761 కోట్ల రూపాయలు విడుదలైనట్లు వివరించారు. ఇందులో రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రాతినిధ్యం వహించే శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు 31.55 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే భారీ ఎత్తున అవినీతి చోటుచేసుకుం దన్నారు. అధికారులు 50శాతం, జన్మభూమి కమిటీలకు 20 శాతం, స్థానిక నాయకులు 20 శాతం, కాంట్రాక్టర్లు 10 శాతం చొప్పున దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రజల నిధులు దుర్వినియోగం అయితే వైకాపా చూస్తూ ఊరు కోదన్నారు. అధికారులు చేయాల్సిన పనులు నాయకులే చేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త బియ్యపు మధు సూదన్‌రెడ్డి మాట్లాడుతూ తూర్పు మండలాలలో సుమారు 50కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో అధికార పార్టీ నాయకులు ప్రజా సొమ్మును దుర్వినియోగం చేస్తే సహించేది లేదన్నారు. శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలలో చెరువు అభివృద్ధి పనులలో భారీ ఎత్తున అవినీతి జరిగిందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు. తొట్టంబేడు మండలంలో 49 చెరువులకు సంబంధించి 3కోట్ల 65లక్షలు, ఏర్పేడు మండ లంలో 167 చెరువు పనులకు 11 కోట్ల 2 లక్షల రూపాయలు నిధులు, రెండో విడతలో 102 చెరువులకు 8కోట్ల 45లక్షల రూపాయలు కేటాయించారని తెలిపారు. నీరు–చెట్టు పథకంలో అవినీతిపై ప్రతిపక్ష పార్టీలైన వైకాపా, వామపక్షాలు, పెద్ద ఎత్తున ఆందోళన నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ జిల్లా యంత్రాంగంలో చలనం లేకుండా పోయిందన్నారు. మంత్రి ప్రజా సమస్యల గురించి పట్టించుకోవడం లేదన్నారు.

అనంతరం పట్టణ పురవీధులలో భారీ ఊరేగింపుగా తెలుగుగంగ కాలనీలోని నీటిపారుదల శాఖ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. వినతిపత్రం తీసుకునేందుకు ఇరిగేషన్ ఇఇ, మేనేజరు కూడా లేకపోవడంతో వైకాపా నాయకులకు, పోలీసులకు కొంత వాగ్వాదం జరిగింది. సోమవారం కనీసం గ్రీవెన్స్‌డేను పాటించకపోవడంపై ఎం.పి. ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు అంజూరు తారక శ్రీనివాసులు, కౌన్సిలర్లు గుమ్మడి బాలకృష్ణయ్య, మిద్దెల హరి, ధర్మయ్య, ఆర్కాడు కాంతమ్మ, వైకాపా నాయకులు లోకేష్‌యాదవ్, బి.హేమభూషణ్‌రెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి, ఏర్పేడు మండల కన్వీనర్ కోటేశ్వరరావు, సలీమ్, నాగ భూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి న్యూస్

శ్రీను గల్పిక

# నెల్లూరు నాయకుల పుష్కరయాత్ర

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. విఆర్ హైస్కూల్ మైదానం. అక్కడ యాత్రాజిని ట్రావెల్స్ వారి వోల్వోబస్సు వుంది. దానిముందు 'నెల్లూరు నాయకుల పుష్కర యాత్ర స్పెషల్' అని బ్యానర్ వ్రాసి వుంది. అప్పుడే అక్కడకు వారివారి కార్లలో నైట్‌రైడర్, మంత్రి నారాయణ, సింహపురి బాహుబలి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్, డాక్టర్ జడ్. శివప్రసాద్, టి. అనూరాధ, వైకాపా నుండి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి. అనిల్‌కుమార్‌యాదవ్, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి, పి. రూప్ కుమార్, బొబ్బల శ్రీనివాసులు, కాంగ్రెస్ నుండి భానుశ్రీ, పనబాక లక్ష్మి, ఆనం రామనారాయణరెడ్డి, బీజేపీ నుండి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డిలు వచ్చి బస్సెక్కారు. పుష్కరాలు, పుణ్యం వంటి వాటి మీద నమ్మకం లేకపోవడంతో వామపక్షాల నాయకులు ఈ యాత్రకు దూరంగా ఉండిపోయారు. సభలు, సమావేశాల్లో ఎప్పుడూ తిట్టుకుంటూ, తన్నుకుంటుండే నాయకులను కనీసం ఒక్కసారైనా కలపాలని, వారి మధ్య స్నేహ బంధాన్ని పెంచాలని మంత్రి నారాయణ ప్రత్యేకశ్రద్ధతో ఈ పుష్కరయాత్రను ఏర్పాటు చేశారు. అందరూ బస్సెక్కారుగానీ నారాయణ బస్సెక్కి డ్రైవర్ సీటులో కూర్చున్నాడు. శుభసూచకంగా వుంటుందని అనూరాధ బస్సుకు దిష్టి తీసి ఎదురొచ్చింది. డ్రైవర్ సీట్లో నారాయణ కూర్చోవడం చూసిన అనిల్‌కుమార్... ఏంటి, బస్సును మీరు నడుపుతారా? మా మీద మీరు ఏదో కుట్ర చేస్తున్నట్లుంది, మమ్మల్ని గోదావరి పుష్కరాల దాకా తీసుకెళ్లేటట్లు లేరు. మీరు దిగి డ్రైవర్‌కు స్టీరింగ్ ఇవ్వండి అని అన్నాడు. నీకేం భయం అక్కరలేదు అనిల్, ఈమధ్య తుళ్లూరులో ట్రాక్టర్లు తోలి డ్రైవింగ్ బాగా నేర్చుకున్నాను, బస్సును నేనే తోలుతానన్నాడు నారాయణ. అందుకు అనిల్ ససేమిరా అన్నాడు. మిగతా వాళ్లు కూడా ప్రాణభయంతో అనిల్‌కు మద్దతుగా లేచారు. దీంతో నారాయణ డ్రైవింగ్ సీటులో నుండి లేచి డ్రైవర్‌ను కూర్చొనిచ్చాడు. బస్సు కదులుతున్నా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బస్సెక్కలేదు. పక్కనేవున్న బొబ్బల శ్రీనివాసయాదవ్... అన్నా బస్సు కదుల్తుందే ఎక్కు అన్నాడు. కదలనివ్వులే అని శ్రీధర్‌రెడ్డి అన్నాడు. అప్పుడే బస్సు స్టార్టై ముందుకు కదిలింది. అన్నా బస్సు పోతుందని బొబ్బల శీనయ్య మళ్లీ శ్రీధర్‌రెడ్డితో మొత్తుకున్నాడు. ఫర్వాలేదు పోనివ్వు అని శ్రీధర్‌రెడ్డి అన్నాడు. నాకెందుకొచ్చిన తలనొప్పిలే అని బొబ్బల శీనయ్య మాత్రం పరుగెత్తుకుంటూ బస్సెక్కాడు. బస్సు విఆర్‌సి దాటి రామలింగాపురం అండర్ బ్రిడ్జి దగ్గరకు చేరుకున్నప్పుడు శ్రీధర్‌రెడ్డి పరుగు మొదలు పెట్టి అండర్ బ్రిడ్జి అవతల పరుగెడుతున్న బస్సులోకి ఎక్కేసాడు. కదలక ముందే బస్సెక్కి వుంటే ఇలా పరుగెత్తాల్సిన పని ఉండేదికాదు కదా అని బొబ్బల శీనయ్య అన్నాడు. అలా చేస్తే కిక్ ఏముంది శీనయ్యా... ఇలా పరుగెడుతూ ఎక్కితేనే థ్రిల్లింగ్‌గా ఉంటుంది... "ప్రేమికుడు" సినిమాలో వడివేలు కూడా ఇలాగే ఎక్కుతాడని శ్రీధర్‌రెడ్డి చెప్పాడు. బస్సు పడుగుపాడు దాటి హైవే ఎక్కింది. నార్త్‌రాజుపాళెం సమీపంలోకి రాగానే బస్సును క్రాస్ చేసుకుంటూ ఒక 'రేంజ్ రోవర్' కారొచ్చి బస్సుకు అడ్డంగా నిలిచింది. బస్సులో వున్న టీవీలో "అత్తారింటికి దారేది" సినిమాలోని 'వీరాడడుగుల బుల్లెట్టు... ధైర్యం విసిరిన రాకెట్టు' అనే పాట వస్తుండగా కారులో నుండి స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానంద రెడ్డి(64+) దిగాడు. నల్ల కళ్లద్దాలు, నల్ల టీషర్ట్, నల్ల జీన్స్... పవన్ కల్యాణ్‌కు ఏ మాత్రం తీసిపోనట్లున్నాడు. నేరుగా వచ్చి బస్సెక్కి... ఏం నారాయణ, నన్ను మరచిపోయారా, మీతో పాటూ నేనూ వస్తానన్నాగా... బయల్దేరే ముందు ఫోన్ చేసుండొచ్చు కదా, గోదావరిలో మునగాలన్న సరదా నాకు మాత్రం ఉండదా? అని అడిగాడు. బీద రవిచంద్ర వుండి... అదేం లేదన్నా, పుష్కర స్నానాలు చేసేది పాపాలు పోగొట్టుకోవడానికే కదా, మీలాంటి పుణ్యాత్ములు పుష్కరాలలో మునిగితే ఏంటి, మునగకపోతే ఏంటి అని అన్నాడు. దానికి వివేకా... ఆ ఏసు ప్రభువు చెప్పినట్లు ఈ లోకంలో అందరమూ పాపులమే... ఈ ప్రపంచంలో ప్రతిదానికీ కొలమానం వుంది, కాని పాపాలను కొలిచే యంత్రాన్ని ఇంకా కనిపెట్టలేదు. కాబట్టి మీతో పాటు మునిగి నా పాపం కూడా అంతోఇంతో కడిగేసుకుంటాను. మనం చేసిన పాపాలన్నీ పూర్తిగా పోవాలంటే గోదావరిలో కాదు, ప్రపంచంలోని సప్తసముద్రాలలో మునిగినా సరిపోదు అని చెప్పి కూర్చున్నాడు. తర్వాత అనూరాధ తాను తెచ్చిన జంతికలను అందరికీ పెట్టగా, భానుశ్రీ అందరికీ లడ్లు ఇచ్చింది. సోమిరెడ్డి మాత్రం వివేకా తెచ్చిన సూట్‌కేసు వైపు చూస్తూ... అందులో క్యాష్ ఏమన్నా వుందా, అంతజాగ్రత్తగా పట్టుకున్నావని అడిగాడు. అంతకంటే విలువైనదే వుంది, దాని విలువ ఏంటో తర్వాత నీకే తెలుస్తుందన్నాడు. వివేకానే వుండి... బస్సంతా చీకటిగా వుంది, లైట్లన్నా వేయకూడదా అని అడిగాడు. వెంటనే డాక్టర్ జడ్. శివప్రసాద్ వివేకా కళ్లకున్న నల్లద్దాలు తీసాడు. అప్పుడు వివేకాకు బస్సులో వున్న వారంతా బాగా కనిపించసాగారు. అబ్దుల్ అజీజ్ వుండి... జీవితకాలం మనం ఒకర్నొకరు తిట్టుకోవడంతోనే సరిపోతుంది, అంత్యాక్షరి ఆడుకుందామని ప్రతిపాదించాడు. అందరూ దానికి ఓకే అన్నారు. మొదట అజీజ్ మొదలుపెడుతూ "నేనే నెంబర్ వన్ కేడీల పనిపట్టే కేడీ నెంబర్ వన్, రౌడీల పనిపట్టే రౌడీ నెంబర్ వన్" అని పాడాడు. తర్వాత కోటంరెడ్డి 'నామది నిన్ను పిలిచింది గానమై వేణు గానమై నా ప్రాణమై' అంటూ పాడాడు. సోమిరెడ్డి వంతు రావడంతో ఆయన... 'ము ము ము ముద్దంటే చేదా... నీకా ఉద్దేశ్యం లేదా... ఇపుడొద్దన్నా వంటే కుర్రవాడా' అనే పాట పాడాడు. తర్వాత వివేకా వంతు రావడంతో... 'డమ్మారే ధమ ధమ ధంధం' అనే పాటను పాడాడు. తర్వాత అనిల్ వంతు రావడంతో... 'మంచు కురిసే వేళలో మల్లె విరిసేదెందుకో, మల్లె విరిసే జాములో మంచు కురిసేదెందుకో' అని పాడాడు. ఇలా వీళ్ల అంత్యాక్షరి ప్రోగ్రామ్ నడుస్తుండగానే రాజమండ్రి వచ్చేసింది. పుష్కరఘాట్ దాకా ఎలాగో బస్సు పోయింది. అక్కడ చూస్తే జనం సందులేరు. బస్సులో నుండి కాలు కింద పెట్టే గ్యాప్ కూడా లేదు. పనబాక లక్ష్మి వుండి... ఈ జనంలో మనం పుష్కర స్నానం చేయడం సాధ్యమేనా? అని సందేహపడింది. సోమిరెడ్డి, బీద, అనూరాధ, రమేష్‌రెడ్డి, ప్రసన్న, సురేష్‌రెడ్డిలు కూడా మనం ఇక్కడ స్నానం చేయాలంటే రెండురోజులన్నా పడుతుందని నిరాశ చెందసాగారు. అప్పుడు వివేకా. ఇక్కడ జనాన్ని చూసేకదా మీరు భయపడేది, ఒక్క నిముషంలో ఈ జనాన్ని ఇక్కడ లేకుండా చేస్తాను, మీరు హాయిగా గోదావరిలో మునగొచ్చన్నాడు. ఎలా అని సోమిరెడ్డి అడిగాడు. ఇలా... అంటూ వివేకా తన వద్దవున్న సూట్‌కేసు తెరిచాడు. అంతే ఒక్క పదిసెకన్ల తర్వాత అక్కడ భక్తుల ఆర్తనాదాలు, పెడబొబ్బలు, హాహాకారాలు... ఘాట్ వద్ద నుండి జనం ప్రాణభయంతో పరుగులు తీస్తున్నారు. ఐదు నిముషాలకు అక్కడంతా నిర్మానుష్యమైపోయింది. అప్పుడు వివేకా... ఇప్పుడు వెళ్లండి... ప్రశాంతంగా గోదావరిలో మున గండి అని చెప్పాడు.

సోమిరెడ్డి ఆశ్చర్యంగా... ఆ సూట్‌కేసులో ఏం తెచ్చావ్ వివేకా అని అడిగాడు. నెల్లూరు ముదురుదోమలను తెచ్చానన్నా... ఇక్కడ పరిస్థితిని నేను ముందుగానే వూహించాను, అందుకే ఎందుకైనా మంచిదని నాలుగు కిలోల దోమలను వెంట తెచ్చాను... అవి వదలబట్టే ఈరోజు ఘాట్ ఖాళీ అయ్యి మనోళ్లు స్నానాలకు వెళ్లగలిగారని చెప్పాడు. వివేకా ముందుచూపును మెచ్చుకుంటూ సోమిరెడ్డి కూడా ఘాట్ వద్దకు వెళ్లాడు మునగడానికి.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అనుకున్న పనులు నిదానంగా జరుగుతున్నా సానుకూలంకాగలవు. నిర్మాణాలు జరిపే వారికి, కాంట్రాక్టర్లకు వర్కర్లతో సమస్యలుండగలవు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి ఆదాయముంటుంది. వ్యాపార వృద్ధి కొత్త ప్రణాళికలను నిర్ణయం చేస్తారు. ఆదాయానికి తగినట్లు అదనపు ఖర్చులుంటాయి. ప్రముఖులతో పరిచయాలు, ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభించగలవు. వ్యాపార ఆర్థిక వ్యవహారాలు అభివృద్ధికరంగా ఉండి సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యవహారాలలో నిర్ణయాలు వల్ల మంచి జరుగుతుంది. సన్నిహితుల వల్ల చిరు సమస్యలుండవచ్చును. రాజకీయవర్గాలకు పలుకుబడి బాగుంటుంది. కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు. వృత్తి పరంగా ఆదాయం పెరుగుతుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభకార్యాలు దైవ కార్యాలలో పాల్గొంటారు. అనుకున్న పనులు సరిగా జరగవు, అయినా మనోధైర్యానికి లోపం లేకుండా ప్రయత్నిస్తారు. వృత్తి వ్యాపారాలలో మెరుగైన అవకాశాలు చేజారిపోవచ్చును. అదనపు ఖర్చులు పెరుగుతాయి. ఆత్మీయుల సహకారంతో సమస్యను అధిగమిస్తారు. ముఖ్య వస్తువులు, పత్రాలు జాగ్రత్త.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ముఖ్యమైన విషయాలలో సమయోచిత నిర్ణయాలు తీసుకొంటారు. ఇంటి రిపేర్లు వస్తువాహన రిపేర్లుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. కొత్త వ్యాపార అవకాశాలు, కొత్త పెట్టుబడి అవకాశాలుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. బిడ్డల విద్యావకాశాలు, శుభకార్య అవకాశాలు లభించగలవు. ఆర్థికంగా బాగుంటుంది. బ్యాంకు ఋణాలు లభించగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

నూతన పెట్టుబడులు పథకాలు లభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు లభిస్తాయి. ఆత్మీయులు, కుటుంబసభ్యుల కొరకు ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరగడం, అభివృద్ధి ఉంటుంది. బిడ్డల వ్యవహారాలు సమస్యాత్మకంగా ఉంటాయి. అధికారులు, ఉద్యోగులు ప్రలోభాలకు దూరంగా ఉండటం మంచిది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బంధువులతో సత్సంబంధాలు ఏర్పడుతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు రాగలవు. పనులు నిదానంగా జరగడం వల్ల టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. బాకీల విషయంలో కొంత సర్దుబాటు జరుగుతుంది. మిమ్మల్ని కాదన్న వారు కూడా మీకు సన్నిహితులు కాగలరు. సోదరులకు అభివృద్ధి బాగుంటుంది.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 24.07.2015 నుండి
తేది. 30.07.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మిధునంలో కుజుడు, కర్కాటకంలో రవి బుధులు, సింహంలో గురుశుక్రులు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

**పంచాంగము:**
తేది 27 సోమవారము తొలి ఏకాదశి

చాతుర్మాస్య వ్రత ప్రారంభము.

**నిజాషాఢ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 24 | శుక్ర | అష్టమి | సా॥ గం.6.22వ॥ |
| తేది. 25 | శని | నవమి | రా॥ గం.7.38వ॥ |
| తేది. 26 | ఆది | దశమి | రా॥ గం.8.22వ॥ |
| తేది. 27 | సోమ | ఏకాదశి | రా॥ గం.8.39వ॥ |
| తేది. 28 | మంగళ | ద్వాదశి | రా॥ గం.8.23వ॥ |
| తేది. 29 | బుధ | త్రయోదశి | రా॥ గం.7.40వ॥ |
| తేది. 30 | గురు | చతుర్దశి | రా॥ గం.6.49వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యవహారాలలో అనుకూలత సరిగా ఉండక ఇబ్బందులు పడతారు. బంధువులతో, ఇతరులతో మన స్పర్థలుండవచ్చును. వృత్తి జీవనం కలవారికి, ఏజెంట్లకు మంచి అవకాశాలు దొరకగలవు. వ్యాపారవర్గాలకు సామాన్య ఆదాయం ఉంటుంది. మంచి వ్యాపారావకాశాలు చేజారిపోవచ్చును. విద్యార్థులకు మంచి ఉన్నత విద్యావకాశాలు లభించగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుగగలవు. బ్యాంకుల నుండి ఋణాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. కొత్త పరిశ్రమలు కొత్త వ్యాపారాలకు అవకాశాలు కలిసి రాగలవు. నిరుద్యోగులకు అవకాశాలు దొరకగలవు. వాహనాలు నడిపేవారు జాగ్రత్తవడవలసి ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆదాయం సామాన్యం. ప్రభుత్వం నుండి అనుమతులు ఆలస్యం కాగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల క్రయవిక్రయాలకు ఆటంకాలుంటాయి. అదనపు ఖర్చులు ఎక్కువగా ఉండినా ప్రయోజనకరంగా ఉంటాయి. వ్యాపారాలలో స్తబ్దత వల్ల కొత్త పథకాలను గూర్చి ఆలోచనలుంటాయి. కోర్టు కేసులు వాయిదా పడతాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

మీ వ్యాపకాలు కార్యకలాపాలు పెరుగుతాయి. షేర్లు పెట్టుబడులు లాభదాయకాలు కాగలవు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు అందుతాయి. స్థలాలు, పొలాలు, బాకీల వ్యవహారాలు పరిష్కారానికి వస్తాయి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. సోదరవర్గానికి మేలు చేకూరుతుంది. శుభకార్య భారాలు వహించడం, ఉద్యోగులకు ప్రోత్సాహకాలుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు, శుభకార్యాలు నిర్ణయం కావడం, సకుటుంబ ప్రయాణాలుంటాయి. స్థిరాస్తుల అభివృద్ధి, క్రయ విక్రయాలు లాభాలనిస్తాయి. కుటుంబ వ్యక్తులకు కొద్దిపాటి విభేదాలుండి సర్దుబాటు కాగలవు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి. కొత్త వ్యాపారాలకు, పరిశ్రమలకు అవకాశాలు, అధికారుల అనుమతులు పొందుతారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

బంధుమిత్రులను, ప్రముఖులను కలుసుకొంటారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరిగి అభివృద్ధి బాగుంటుంది. మీ ఆలోచనలు, పథకాలు అనుకున్నట్లుగా జరిగి, కార్యరూపం ధరిస్తాయి. కీలకమైన వ్యవహారాలలో మంచి నిర్ణయాలు తీసికొంటారు. అయితే టెన్షన్ ఎక్కువుగా ఉంటుంది. కోర్టు కేసులందు అనుకూలత, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.



# కావలి కబుర్లు

## అమెరికాలో వైయస్సార్ 66వ జయంతోత్సవాలు

### కావలి ఎమ్మెల్యే రామిరెడ్డికి ఘన సన్మానం




మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి 66వ జయంత్యోత్సవాలను అమెరికాలోని అట్లాంటా నగరంలో ప్రవాసాంధ్రులు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతోత్సవాలలో పాల్గొనేందుకు ఆంధ్ర ప్రదేశ్ నుండి కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డితో పాటు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రామకృష్ణా రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, అంబటి రాంబాబులు వెళ్లారు. వీరికి ప్రవాసాంధ్రులు అట్లాంటా విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డా యన్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాలతో ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయా రన్నారు. సమావేశం ముగింపు సందర్భంగా ప్రవాసాంధ్రులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించి జ్ఞాపిక బహూకరించారు.



ఈ నెల 18వ తేదీన రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నెల్లూరు ఆదిత్యనగర్‌లో పేద ముస్లింలకు బియ్యం, నిత్యావసర వస్తువుల ప్యాకెట్లను ఉచితంగా అందజేస్తున్న వ్యాపార వేత్త బిజవేముల రమణారెడ్డి, పాముల రమణయ్య, గురువారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు

## కాలధర్మం

### మడుపు నరసింహారెడ్డి



నెల్లూరు, శాంతినగర్‌లోని ప్రముఖ న్యాయవాది మడుపు రవీంద్రరెడ్డి తండ్రి నరసింహారెడ్డి ఈ నెల 20వ తేదీ సోమవారం హైదరాబాద్‌లో కనుమూసారు. ఆయన వయస్సు 83సంవత్సరాలు. ఆయనకు ముగ్గురు కుమారులు. పెద్ద కొడుకు రవీంద్రరెడ్డి సుదీర్ఘకాలంగా నెల్లూరులో న్యాయవాద వృత్తిలో వుంటూ జిల్లా వ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్నారు. రెండవ కుమారుడు దివింద్రరెడ్డి హైదరాబాద్‌లో విద్యుత్‌శాఖలో పనిచేస్తున్నారు, కాగా మూడవకుమారుడు హరేంద్రరెడ్డి అమెరికాలో స్థిరపడ్డారు. నరసింహారెడ్డి గతంలో భారత సైన్యంలో చేరి దేశ సేవలో తరించారు. అనంతరం నెల్లూరులో ఎన్‌సిసిలోనూ, ఆ తర్వాత శ్రీహరికోటలోని షార్ సెంటర్‌లోనూ పని చేశారు. మెదక్ జిల్లాకు చెందిన నరసింహారెడ్డి ఉద్యోగరీత్యా ఎక్కువకాలం నెల్లూరులో పనిచేసినా ఉద్యోగ విరమణ అనంతరం సికింద్రాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన పెద్దకొడుకు రవీంద్రరెడ్డి మాత్రం నెల్లూరులోనే స్థిరపడ్డారు. నరసింహారెడ్డి మనుమడు రోహిత్(రవీంద్రరెడ్డి కుమారుడు) 'దిల్ దివానా' సినిమాతో హీరోగా తెలుగుతెరకు పరిచయం కావడం తెలిసిందే! ఆయన ఉత్తరక్రియలు ఈ నెల 30వ తేదీన సికింద్రాబాద్‌లోని ఏడబ్ల్యూహెచ్‌ఓ కాలనీ, సెక్టర్-సి, క్వార్టర్ నెం.ఇ8, డైమండ్ పాయింట్, సిఖ్ విలేజ్‌లోని నరసింహారెడ్డి స్వగృహమునందు జరుగుతాయని రవీంద్రరెడ్డి తెలిపారు. నరసింహారెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# జాతీయ నాయకులకు ఇచ్చే గౌరవం ఇదేనా?



దేవాలయం నిర్మించి, దేవుని ప్రతిష్టించకపోవడం ఎంత తప్పో... జాతీయ నాయకుల విగ్రహాలను తయారు చేయించి, వారిని పట్టణ ప్రధాన కూడళ్లలో పెట్టకపోవడం అంతే నేరంగా భావించాలని మేధావులు అభిప్రాయ పడుతున్నారు.

సుమారు 7సంవత్సరాల క్రితం కావలి పట్టణానికి చెందిన కొందరు నాయకులు రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్, భారత మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాలను తయారు చేయించి వాటిని పట్టణంలో మంజూరు చేసిన ప్రదేశాలలో ఉంచడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఈ విగ్రహాలను మద్దూరుపాడు మార్కెటింగ్ గ్రౌండ్స్‌లో వుంచడంతో వచ్చిపోయే నాయకులు, ప్రజాప్రతినిధులు చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజల కోసం జీవితాలను త్యాగం చేసిన నాయకులను గ్రౌండ్స్‌లో బందీలుగా వుంచి వారిని అగౌరవపరచడం చాలా బాధాకరం అని, వెంటనే వారిని పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో వుంచి సముచిత గౌరవం ఇవ్వాలని నాయకులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పుష్కరయాత్రలో విషాదం

- యాత్రికుల బస్సును ఢీకొన్న లారీ
- ముగ్గురు మృతి, 20 మందికి గాయాలు

గోదావరి మహాపుష్కరాలకు వెళ్లి నదిలో మునిగి వారి జన్మను పునీతం చేసుకోవాలన్న భక్తుల ఆశలు మధ్యలోనే విషాదంతో నిండిపోతున్నాయి. కడనూతల గ్రామం సమీపంలో పుష్కరయాత్రకు వెళుతున్న భక్తులు ప్రయాణిస్తున్న బస్సు ఆగి ఉండగా వెనుక నుండి వేగంగా వస్తున్న లారీ ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. 5మందికి తీవ్రగాయాలు, మరో 15మందికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు కథనం మేరకు ఆదివారం రాత్రి 10గంటల సమయంలో గూడూరు మండలంలోని వెందోడు, ఓజిలి మండలంలో ఆర్మేనిపాడు, గూడూరులకు చెందిన 48మంది ఒక ట్రావెల్స్ బస్సును పుష్కరాలకు మాట్లాడుకున్నారు. బోగోలు మండలం, కడనూతల గ్రామ సమీపంలో బస్సు ఇంజన్ రిపేరుకు గురై ఆగిపోయింది. దీనిని రిపేరు చేయించేందుకు బస్సు డ్రైవర్, మెకానిక్ కోసం సమీపంలోని గౌరవరం గ్రామానికి వచ్చాడు. బస్సు నిలిచిపోవడంతో యాత్రికులు కొందరు కాల కృత్యాలు తీర్చుకునేందుకు బస్సులో నుండి క్రిందకు దిగారు. అనంతరం ఆనంద్(45), జయకోటి(45), మస్తానయ్య(45), సుబ్రహ్మణ్యంలు బస్సు వెనకకు వెళ్లి మాట్లాడుకొంటుండగా వెనుక నుండి లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు మార్గం మధ్యంలో మరణించారు. గాయాలైన వారిని 108, హైవే మొబైల్ వాహనాల ద్వారా కావలి, నెల్లూరు ఆసుపత్రులకు తరలించారు. వీరిలో మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.



కావలి డిఎస్పీ రాఘవరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించి బస్సు డ్రైవర్, యాత్రికుల నుండి వివరాలు సేకరించారు. లారీ డ్రైవర్ పరారీలో వున్నాడు. బోగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆపదలో ఆదుకోవడం ప్రాణదానంతో సమానం

**- బ్రేక్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి**



ఆపదలో ఆదుకోవడం ప్రాణదానంతో సమానమని కావలి రోడ్డు రవాణాశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడనూతల సర్పంచ్ నీలిమ, ఆమె భర్త మల్లికార్జునరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో గోదావరి పుష్కరాలకు వెళ్తున్న ట్రావెల్ బస్సును లారీ ఢీకొన్న సంఘటన తెలుసుకొని వెంటనే గ్రామ ప్రజలను వెంటబెట్టుకుని ప్రమాద స్థలం దగ్గరకు వచ్చి మల్లికార్జునరెడ్డి బాధితులను వెంటనే ప్రభుత్వాసుపత్రులకు తరలించడంలో స్పందించిన తీరు అభినందనీయమన్నారు. ఇలాంటి వారు జాతీయ రహదారి ప్రక్కన ఉన్న గ్రామాల్లో ఊరికి ఒక్కరు వున్నా, ప్రమాదాలలో గాయపడిన వారు ఒక్కరు కూడా ఇబ్బందులు పడకుండా ఉంటారని కొనియాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు చూసిన ప్రతిఒక్కరు తమకెందుకులే అని కాకుండా వెంటనే స్పందిస్తే చాలామంది ప్రమాద బాధితులను రక్షించవచ్చన్నారు. మల్లికార్జునరెడ్డిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని బాధితులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయపడాలని కోరారు.

# కార్మికుల సమ్మె ప్రభుత్వానికి కనిపించదా?



కనీస వేతనం, తదితర డిమాండ్ల సాధనకై చేస్తున్న పురపాలక సంఘ కార్మికుల సమ్మె ప్రభుత్వానికి కనిపించకపోవడం వారి పరిపాలన తీరుకు నిదర్శనమని సిపిఐ నాయకులు దామా అంకయ్య, దేగా సత్యనారాయణలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గత రెండు వారాలుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలుపుతున్నా సమ్మెను అణచివేసే ధోరణిని ప్రభుత్వం అవలంభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికై చర్చించి మార్గం చూపాలన్నారు. ఒకప్రక్క పట్టణాలలో చెత్తా చెదారాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, ప్రజలు దీని ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికుల సమస్యలు పట్టించుకోలేని ఇలాంటి ప్రభుత్వాలపై వామపక్షాలు పోరుకు సిద్ధమౌతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి వచ్చి కార్మికులతో చర్చించి వారి డిమాండ్లు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఎం కావలి డివిజన్ కార్యదర్శి టి.మాల్యాద్రి, పెంచలయ్య, రామయ్య, మల్లిఖార్జున తదితరులున్నారు.

# టోల్‌గేట్ నిర్మాణంతో తంటాలు

నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో వున్న కనుపర్తిపాడు వద్ద టోల్‌గేట్ నిర్మాణాన్ని నిలిపివేయాలని, అక్కడ టోల్‌గేట్ నిర్మాణం చేస్తే నిత్యం వేలాదిమంది వాహనదారులకు ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆ మేరకు ఈ విషయమై ఆయన బుధవారం జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకితో చర్చించారు. ఇక్కడ జాతీయరహదారిపై టోల్‌గేట్ పెట్టడం వల్ల నెల్లూరు నగరం, గ్రామీణ ప్రాంతాల వాసులకు టోల్‌ఛార్జీలు పెరిగి వారు ఇబ్బందులు పడతారని, అంతేకాక టోల్‌గేట్ ప్రభావం వల్ల ఎన్టీఆర్ నగర్, చిల్డ్రన్స్ పార్క్, అయ్యప్పగుడి ప్రాంతాల నుంచి బైపాస్‌లోని వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తాయని, అందువల్ల ప్రమాదాలు అధికమయ్యే అవకాశం వుందని ఆయన కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అంతేకాక, ఈ టోల్‌గేట్ వల్ల హైవేలో రాకపోకలు సాగించే వాహనాలు, టోల్‌గేట్ ఛార్జీల నుంచి తప్పించుకునేందుకు నగర రోడ్ల మీదికో, లేదా నెల్లూరు రూరల్‌లోని రోడ్ల మీదనో వాహనాల రాకపోకల సాగించడం జరుగుతుందని, తద్వారా ఈ ప్రాంతాల్లో రోడ్లు బాగా దెబ్బతింటాయని ఆయన కలెక్టర్‌కు తెలిపారు. ఇన్ని రకాలుగా అనర్థాలకు గురిచేసే ఈ టోల్‌గేట్ నిర్మాణ ఏర్పాట్లను వెంటనే నిలిపివేయాలని ఆయన కోరారు. కనుపర్తిపాడు తదితర గ్రామీణప్రాంతాల్లోని ఏడు గ్రామాల ప్రజలు నగరంలోకి రావాలంటే కనుపర్తిపాడు సమీపంలోని హైవే ప్రధానమార్గమని, వారు నగరంలోకి వచ్చేందుకు టోల్‌ఫీజులు చెల్లించాలంటే వారికి అది అదనపు భారం అవుతుందని ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయపార్టీల నాయకులు, ప్రజలు ఈ టోల్‌గేట్‌ను వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మాత్రం టోల్‌గేట్ ఏర్పాటుకు సన్నాహాలు చేయడం ఏమిటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టోల్‌గేట్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తే అన్ని రాజకీయ పార్టీలతో కలసి ఆ నిర్మాణాన్ని అడ్డుకుంటామని కూడా ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. టోల్‌గేట్ ఏర్పాటు చేయవద్దని, ఆ సన్నాహాలను విరమించేలా చూడాలని ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యేతో పాటు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, నగర కమిషనర్ పివిఎస్ మూర్తిలు పాల్గొన్నారు.

## సమస్యలు తీర్చేదాకా సమ్మె ఆగదు

ఈ ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు కల్పించినా తమ సమ్మె మాత్రం ఆగనే ఆగదని, సమస్యలు తీర్చేదాకా తమ పోరాటం ఆపేది లేదని మునిసిపల్ కార్మికసంఘం నాయకులు స్పష్టం చేశారు. బుధవారం నెల్లూరు నగరపాలకసంస్థ కార్యాలయాన్ని ముట్టడించి, గేటు వద్ద బైఠాయించి వారు ఆందోళన నిర్వహించారు. తమ సమస్యలను తీర్చేంతవరకు తామిక్కడ నుంచి కదిలేది లేదని పట్టుబట్టారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఏపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కార్మికులకు వేతన కమిటీ నిర్ణయించిన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత కొద్దిరోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మునిసిపల్ మంత్రి నారాయణలకు కార్మికుల గోడు పట్టడం లేదని వారు విమర్శించారు. ఈ ఆందోళనలో సిఐటియు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సిపిఎం కార్పొరేటర్ బి.పద్మజ, యూనియన్ నాయకులు అల్లాడి గోపాల్, సిపిఎం నాయకులు బివి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలిగిరిలో భూ ప్రకంపనలు

బుధవారం ఉదయం 8.30 గంటల ప్రాంతాల్లో కలిగిరి మండలంలోని పలు గ్రామాల్లో స్వల్పంగా భూమి కంపించింది. మండలంలోని కుమ్మరకొండూరు, పెద్ద కొండూరు, వీరారెడ్డిపాళెం తదితర ప్రాంతాల్లో కొద్ది సెకన్లపాటు భూమి కంపించిందని అక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. భూ ప్రకంపనతో పాటు శబ్ధం రావడంతో, ఇళ్ళలో టేబుళ్ళమీద వుంచిన వస్తువులు కిందపడడం జరగడంతో, ఏమి జరుగుతుందో ఏమోనని ప్రజలు భయాందోళనలతో ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. అయితే, ఎలాంటి నష్టం వాటిల్లక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## మారుతున్న జగన్

(మొదటిపేజీ తరువాయి)

సమభావంతో చూడాలి. ఇతర మత సంప్రదాయాలను గౌరవించాలి. వీలైతే ఆచరించాలి. వై.యస్. క్రిస్టియన్ అయినప్పటికీ ప్రజాజీవనంలో అన్ని మతాలను గౌరవించాడు. అన్ని మతాల విశ్వాసాలను ఆచరించాడు. రాష్ట్రంలోని అన్ని గుళ్లు తిరిగాడు. సీఎంగా ఐదేళ్ల కాలంలో వై.యస్. తిరుమలకు వెళ్లినన్ని సార్లు ఇంకే సీఎం కూడా వెళ్లి వుండడు. తనపై ఎటువంటి మత ముద్రను లేకుండా చేసుకున్నాడు. అన్ని మతాల వాళ్లు కూడా వై.యస్‌ను తమ మనిషనేలా చేసుకున్నాడు.

కానీ, జగన్ విషయంలో ఎందుకనో ప్రజల్లో ఆ భావం రాలేదు. జగన్ వ్యతిరేక మీడియా ప్రచారానికి ఇది దోహదపడింది. విజయమ్మ బైబిల్ పట్టుకోవడాన్ని పెద్ద ప్రచారాంశంగా మార్చింది. ఈ ప్రచారం వల్లే బ్రాహ్మణులు, వైశ్యులు గత ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి దూరమయ్యారు.

గత ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను సరిదిద్దుకునే దిశగా జగన్ ఇప్పుడు అడుగులు వేస్తున్నాడు. 2004లో వై.యస్. సిఎంగా ఉండగా కృష్ణా పుష్కరాలు జరిగాయి. పుష్కరాల ప్రారంభం రోజున వై.యస్. విజయవాడలోని ఘాట్‌లో మునగకుండా తలమీద నీళ్లు చల్లుకున్నాడు. అప్పుడు వై.యస్. వ్యతిరేక మీడియా దీనిని పెద్ద రాద్ధాంతం చేసిచూపింది.

ఈసారి ప్రతిపక్ష నేతగా జగన్ గోదావరి పుష్కరాలలో పూర్తి సంప్రదాయ బద్ధంగా వ్యవహరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగనీయకుండా కొవ్వూరులోని గోష్పాదక్షేత్రంలో పుణ్యస్నానం చేసి శాస్త్రోక్తంగా తన పెద్దలకు పిండప్రదానం చేశాడు. జగన్‌ను వ్యతిరేక మీడియా ఇక్కడ కూడా వదల్లేదు. స్నానం చేసే సమయంలో ఆయన మెడలోని శిలువ లాకెట్‌ను పదేపదే చూపించారు.

జగన్ క్రిస్టియన్ అన్న సంగతి బహిరంగ రహస్యం. ఆయన ఆ విషయాన్ని దాచిపెట్టుకోలేదు. ఇతర మతాల వాళ్లు పుష్కరస్నానం చేయకూడదనే నిబంధనలేవీ లేవు. ఈ పుష్కరాలకు గోదావరిలో కోట్ల మంది స్నానాలు చేసారు. వారిలో క్రైస్తవులు, ముస్లింలు లేరని ఎవరన్నా గ్యారంటీ ఇవ్వగలరా? ఏ మతం వారైనా ఇతర మత విశ్వాసాలను గౌరవిస్తున్నప్పుడు ఇలా వంకరగా వేలెత్తి చూపడం మంచి పద్ధతి కాదు.

ఇక జగన్ తనపై వున్న మత ముద్రను కొంతవరకు చెరిపేసుకోవడంలో పుష్కరాలు ఉపయోగపడ్డాయి. మతపరమైన ప్రచారాలకు వారి కుటుంబం ఎంత దూరంగా వుంటే జగన్ అన్ని మతాల ప్రజలకు అంత దగ్గరవుతాడు.

## అటు వేనాటి... ఇటు వాకాటి

(5వ పేజీ తరువాయి)

ఒంటి కాలితో లేచాడు. నిన్నగాక మొన్న పార్టీలో చేరి, 30ఏళ్ల నుండి పార్టీనే కనిపెట్టుకుని వున్న మా కార్యకర్తలను తిడతావా అంటూ గొడవకు దిగారు. మేం బ్రతిమలాడుకుని చేరలేదని, చంద్రబాబు రమ్మంటేనే పార్టీలో చేరామని వాకాటి బదులిచ్చారు. ఇక్కడ మాటా మాట పెరగి రభస చోటు చేసుకుంది. దీంతో సమన్వయకర్త ఆనం జయకుమార్‌రెడ్డి సమావేశాన్ని రద్దు చేశారు.

సూళ్లూరుపేటకు సంబంధించి తెలుగుదేశం పార్టీపై 2014ఎన్నికల వరకు కూడా వేనాటి ఆధిపత్యమే నడిచింది. అప్పటివరకు పార్టీలో మరోవర్గం ఉండేది కాదు. 2014 ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో వున్న వాకాటి నారాయణరెడ్డి తెలుగుదేశంలో చేరారు. కొందరు నాయకులు ఆయనకు జత కలవడంతో వేనాటికి పోటీ వర్గం తయారైనట్లయ్యింది. దీంతోనే ఇరు వర్గాల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. ఈ ఏడాది మొదట్లో జరిగిన పక్షుల పండుగ సందర్భంలో ఇరువర్గాల మధ్య వివాదం రేగడం, మంత్రి నారాయణ జోక్యం చేసుకుని సర్ధిచెప్పడం జరిగింది. ఇటీవల కూడా ఇరు వర్గాల పోరు చంద్రబాబు దాకా వెళ్లిందని తెలుస్తోంది.

సూళ్లూరుపేటలో గొడవలకు ఒకరకంగా పార్టీ అధిష్టానమే కారణం. పార్టీలన్నాక నాయకులు చేరడం, వదిలిపోతుండడం సర్వసాధారణమే. అయితే కొత్త నాయకులను చేర్చుకునే ముందు పాత నాయకులను ఒప్పించి, వారిని సమన్వయ పరచి ఉండాలి. కొత్త నాయకుల పెత్తనాన్ని పాత నాయకులు సహించే పరిస్థితి వుండదు. పార్టీలో చంద్రబాబు కన్నా సీనియర్ కాబట్టి వేనాటి రామచంద్రారెడ్డికి న్యాయం చేసి, వాకాటిని పార్టీలో చేర్చుకుని వుండుంటే ఇక్కడ ఏ గొడవా వుండేది కాదు.

# అరచేతిలో 'అమరావతి'

(మొదటిపేజీ తరువాయి)

వచ్చి అక్కడ రైతులు బాగుపడుండేవాళ్లు. ఇద్దరికీ ఇదే తేడా! చంద్రబాబు సీఎం అయ్యింది మొదలు రాజధాని ఒకటే లోకమన్నట్లు వ్యవహరించడం చూస్తున్నాం. ఇందుకోసం ఆయన రెండుసార్లు సింగపూర్ పర్యటనకు వెళ్లారు. సింగపూర్ వాళ్లను ఇక్కడకు పిలిపించాడు. ప్రపంచంలో సింగపూర్ ఒక్కటే గొప్ప నగరం అన్నట్లు, చంద్రబాబు పట్టుబట్టి వారికే రాజధాని మాస్టర్‌ప్లాన్ బాధ్యతలు అప్పగించాడు. స్నానం చేసిన నీటినే తిరిగి శుద్ధి చేసుకుని తాగేవాళ్లు సింగపూరోళ్లు. వాళ్లకు వ్యాపారం బాగా తెలుసు. ఆంధ్రప్రదేశ్ రాజధాని రూపంలో వ్యాపారం దొరికిందని సంబరపడి వాళ్లు కూడా ఆరునెలల్లోనే మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేసి ఈ నెల 20న గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమండ్రిలోనే చంద్రబాబు చేతికిచ్చారు.

సింగపూర్ వాళ్లిచ్చిన మాస్టర్‌ప్లాన్‌లో అమరావతి గేట్‌వే, వాణిజ్యనగరి, ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు, అమరావతి నదీముఖం అనే నాలుగు భాగాలున్నాయి. ఇక రాజధానిలో 40శాతం పార్కులే! 45అంతస్థులతో రెండు ఐకానిక్ టవర్లు, 135 కిలోమీటర్ల మెట్రో రైలు మార్గం, 18మీటర్ల వెడల్పుతో రోడ్లు, వెయ్యి కిలోమీటర్ల రహదారులు, వాకింగ్ ట్రాక్‌లు, సైకిల్ ట్రాక్‌లు, మల్టీప్లెక్స్‌లు, ఆకాశహర్మ్యాలు, సాంస్కృతిక కేంద్రాలు... అబ్బో ఒక్కటేమిటి... సింగపూర్ వాళ్లిచ్చిన మాస్టర్‌ప్లాన్ చూస్తే మతిపోవడం ఖాయం. ఎందుకంటే రాజధాని మస్టార్‌ప్లాన్‌ను రూపొందించింది సింగపూర్ వాళ్లే అయినప్పటికీ, సింగపూర్ కూడా ఇలాలేదు. ఒక రకంగా చెప్పాలంటే ప్రపంచంలో ఏ మేటి నగరం కూడా మాస్టర్ ప్లాన్‌లో చూపించిన అమరావతి అంత అందంగా లేదేమోననిపిస్తుంది. ఈ మాస్టర్‌ప్లాన్ చూస్తే ఆయా రియల్‌ఎస్టేట్ కంపెనీలు ప్రచురించే బ్రోచర్‌లు గుర్తుకువస్తాయి. మా వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, జిమ్, రిక్రియేషన్ క్లబ్, టెన్నిస్‌కోర్టు... ఇలా ఎన్నెన్నో ఉంటాయి. తీరా లేఅవుట్ చేసాక చూస్తే ఏమీ వుండదు. సింగపూర్ రాజధాని మాస్టర్‌ప్లాన్ కూడా అలాంటిదే!

పదికోట్ల విలువచేసే భవనానికైనా పదివేల ఖర్చుతో ప్లాన్ గీయించవచ్చు. కాని ప్లాన్‌లో వున్న విధంగా భవనాన్ని కట్టాలంటే 10కోట్లుండాలి కదా! అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్‌ను కూడా సులభంగానే గీయించారు. కాని ఇలాంటి రాజధానిని నిర్మించాలంటే ఎన్నేళ్లు పడుతుంది, ఎన్ని లక్షల కోట్లు ఖర్చవుతుంది... దీనిపై ఇంతవరకు అంచనా లేదు. సింగపూర్ కంపెనీవాళ్లే 2050సంవత్సరం దాకా టైంపెట్టారు. అంటే చేతిలో దండిగా డబ్బులుండి చేస్తే అప్పటికి అవుతుంది. కాని ఇక్కడ చూస్తే రాష్ట్ర ఖజానా ఖాళీ! ఉన్న నిధులను ఇప్పటికే పట్టిసీమ, పుష్కరాలకు మళ్లించారు. ఉద్యోగులకు నెలకు ఠంఛన్‌గా జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి. రాజధాని నిర్మాణానికి కేంద్రం సాయం అంతంత మాత్రంగానే ఉండబోతుంది. వాళ్లేదో రేకులషెడ్డు లాంటి రాజధానికి సాయంచేయాలనుకుంటే చంద్రబాబు నూరంతస్తుల మేడలాంటి దానికి ప్లాన్ చేసాడు. కేంద్రం నిధులు ఇవ్వక, రాష్ట్రానికి ఆదాయం లేక మరి ఈ అద్భుత రాజధానిని ఏ విధంగా కట్టాలనుకుంటున్నారో అంతుబట్టడం లేదు. రాజధాని నిర్మాణాన్ని సింగపూర్ వాళ్లు చూసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. మరి సింగపూర్ వాళ్లు రూపాయికి పదిరూపాయల ఆదాయం ఆశిస్తారు. అలాంటి వాళ్లు చంద్రబాబుకు రాజధానిని ఫ్రీగా కట్టిస్తారా?

ఈ మాస్టర్‌ప్లాన్‌తోనే అసలైన రియల్ వ్యాపారం కాబోతుంది. రైతుల భూములతో అటు సింగపూర్ కంపెనీ, ఇటు చంద్రబాబు కంపెనీ వ్యాపారాలకు తెరతీయనున్నాయి. వీళ్లకు భూములు, అన్నదాతలకు అవస్థలు మిగలనున్నాయి. రాజధాని మాస్టర్‌ప్లాన్ కాపీ మాత్రం పదికాలాల పాటూ భద్రంగానే వుంటుంది. మనతరం వాళ్లు మాస్టర్‌ప్లాన్ చూసారు. మన తర్వాత తరం వాళ్లు గాని, వారి తర్వాత వాళ్లు గాని అలాంటి రాజధాని చూస్తారేమో... ఈతరం వారికైతే ఆశలు లేవు.

## 'నారాయణ' జపం మానండి

(మొదటిపేజీ తరువాయి)

మేధావి చంద్రబాబు గట్టిగా 13నెలల రాజకీయానుభవం లేని నారాయణపై ప్రతిదానికీ ఆధారపడుతుండడాన్ని తెలుగుదేశంలోని సీనియర్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో నారాయణ నెంబర్-2 అనిపించుకుంటున్నాడు. చంద్రబాబు నారాయణకు ఇస్తున్న ప్రాధాన్యత ఇంకే సీనియర్ మంత్రికి కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వపరంగా ఏ పని తలపెట్టినా, ఏ నిర్ణయం తీసుకోవాలన్నా చంద్రబాబు ముందుగా నారాయణ పేరునే ఎత్తుతున్నాడు. అదీగాక ప్రభుత్వం ఏర్పడ్డ తొలిరోజుల్లో అయితే నారాయణ పనితీరును చూసి మీరు నేర్చుకోవాలంటూ చంద్రబాబు చేసిన ఉపదేశాలు కూడా సీనియర్లకు మండేలా చేసాయి. నారాయణ కూడా చంద్రబాబుకు నేనెంత చెబితే అంతే అన్నట్లుగా వ్యవహరిస్తుండడం మిగతా మంత్రులకు మింగుడుపడడం లేదు. నారాయణ వైఖరిపై ఇప్పటికే కొందరు మంత్రులు విసిగి వున్నారు. చంద్రబాబుకు ఈ విషయం చెప్పారు.

తాజాగా రాజమండ్రిలో జరిగిన కేబినెట్ సమావేశంలోనూ కొందరు మంత్రులు నారాయణ వైఖరి మీద మండిపడ్డట్లుగా తెలుస్తోంది. గోదావరి పుష్కరాలలో కూడా నారాయణకే ప్రాధాన్యత కల్పించారు. ఈ విషయంలో దేవాదాయశాఖ మంత్రిని కూడా పక్కనపెట్టడం తెలిసిందే! చివరకు ఉభయగోదావరి జిల్లాలకు చెందిన మంత్రులకంటే నారాయణకే పుష్కరాల పెత్తనం అప్పగించారు. నారాయణ బిల్డప్ కూడా అదే రేంజ్‌లో ఇచ్చాడు. దీంతో అక్కడి మంత్రులు రగిలిపోయారు. రాజమండ్రి కేబినెట్ సమావేశంలో నారాయణకు పెత్తనం అప్పగించడంపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. రాజకీయంగా తమ ముందు చంటిపిల్లోడు అయిన నారాయణ పెత్తందారీ తనాన్ని మిగతా నాయకులు సహించలేకపోతున్నారు.




# 'ఆస్కార్' స్థాయిలో టియస్ఆర్ అవార్డులు

# సుబ్బరామిరెడ్డి అదరగొట్టాడు













పరమశివుడికి మూడు కళ్ళు ఎలాగో పార్లమెంటు సభ్యుడు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డికి రాజకీయ, సినీ, పారిశ్రామిక రంగాలు మూడు నేత్రాల్లాంటివి. ఏ రంగంలోనైనా ఆయన శైలి ప్రత్యేకంగా ఉంటుంది. రాజకీయ, వ్యాపారాలలో బిజీగా వుంటున్నప్పటికీ సినీరంగంపై ఆయన చూపించే శ్రద్ధ చాలా గొప్పది. సినీరంగాన్ని ప్రోత్సహించడానికి మన సుబ్బరామయ్య ఎన్నో కార్యక్రమాలు చేస్తుంటాడు. ఉత్తమ సినిమాలను, ఉత్తమనటులను అభినందించడం కోసం జాతీయ సినీ పురస్కారాల వేడుకను మొన్న ఆదివారం టివి9 న్యూస్ ఛానెల్‌తో కలిసి నిర్వహించారు. ఆ పురస్కారాల పండుగ ఈ నెల 19వ తేదీ హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. తాను ఏ పని చేసినా టియస్ఆర్ స్టైల్‌లో చేసే సుబ్బరామిరెడ్డి ఈసారి కూడా అదరగొట్టాడు. బాలీవుడ్ భామలతో పాటు అగ్రహీరోలనందరినీ హైదరాబాద్‌కు రప్పించాడు. బాలీవుడ్ నటుడు రిషీకపూర్ 'మిలీనియం సెన్సేనల్ స్టార్' పురస్కారాన్ని అందుకోగా, 'లెజండ్' సినిమాలో అత్యుత్తమ నటనా ప్రతిభను చూపిన నటసింహం బాలకృష్ణకు ఉత్తమనటుడు పురస్కారం అందజేశారు. 'దృశ్యం' సినిమా నుండి పురస్కారాన్ని విక్టరీ వెంకటేష్, 'రౌడీ' చిత్రం పురస్కారాన్ని కళాప్రపూర్ణ మోహన్‌బాబు, 'మనం' సినిమా పురస్కారాన్ని స్వర్గీయ అక్కినేని నాగేశ్వర రావు తరపున నాగచైతన్య, అఖిల్‌లు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు కళాశక్తిని ప్రపంచానికి చాటి, తెలుగు కళావైభవాన్ని కాపాడాలన్నదే తన ఆశయమన్నారు. తెలుగు సినిమాను ప్రోత్సహించడానికి తనవంతు సహకారం ఎప్పుడూ వుంటుందన్నారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన "ఆస్కార్" అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమ స్థాయిలో ఈ వేడుక జరిగింది. దివి నుండి భువికి నక్షత్రాలు దిగివచ్చినట్లుగా బొంబాయి తారలు మొత్తం దాదాపుగా ఈ వేడుకకు తరలివచ్చారు. బాలీవుడ్ నుండి టాలీవుడ్ దాకా వున్న తన పరిచయాలను, స్నేహపరిమళాలను సుబ్బరామిరెడ్డి మరోసారి గుభాళింపజేశాడు. శతృఘ్నసిన్హా, జయప్రద, శిల్పాశెట్టి, శక్తి కపూర్, జమున, రానా, షబానా ఆజ్మీ, రవీనాటాండన్, రామ్‌చరణ్, గోపీచంద్, బోయపాటి శ్రీను, శ్రీను వైట్ల, శ్రియ, శ్రీప్రియ, లక్ష్మీప్రసన్న, గుల్షన్‌గ్రోవర్, అద్నాన్‌సమీ, మధుర్ బండార్కర్, రమేష్ సిప్పీ, పరుచూరి బ్రదర్స్, జయసుధ, జీవిత, రాజశేఖర్, తమన్న, మీన, రకుల్‌ప్రీత్‌సింగ్, పింకీరెడ్డి, శోభన, ప్రభు, సుమన్‌తో పాటు అనేకమంది ప్రముఖులు పాల్గొని ఈ వేడుకకు తళుకులద్దారు. ఈ తారలందరి మధ్యలో తానొక స్టార్‌లా మెరుస్తూ 7పదుల వయసులో కూడా పాతికేళ్ల కుర్రాడిలా కార్యక్రమాన్నంతా సుబ్బరామిరెడ్డి తానే నడిపించడం ఈ వేడుకలో హైలైట్!

















Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com